# శేనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగు దినపత్రిక | సంపుటి :02 | సంచిక : 142 | మంగళవారం 06 మే 2025 | పేజీలు: 08 | వెల రూ.5

PUBLISHED FROM : KARIMNAGAR : CIRCULATED TO : ADILABAD, WARANGAL, NIZAMABAD, WARANGAL,HYDERABAD,KHAMAM, NALGONDA, MAHBUBNAGAR,MEDAK, RANGAREDDY



## రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
శేనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

PRESS

97051 46268 77805 51339
98491 98098




## తెలంగాణ రోడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- రోడ్డు కనెక్టివిటీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- రూ.3,900 కోట్ల విలువైన పనులకు ప్రారంభం
- నీటి సంరక్షణ పథకాలతో రైతులకు మేలు
- ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి
- కాగజ్‌నగర్ వేదికగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ
- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు
- రాజీవ్ రహదారిని మంచిర్యాల వరకు పొడిగించాలి
- కాగజ్‌నగర్ సభలో కేంద్రమంత్రి బండి సంజయ్
- కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రోడ్డు కనెక్టివిటీ
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

**కుమ్రంభీమ్ ఆసిఫాబాద్,మే5:**
తెలంగాణలో రోడ్ల అభివృద్ధి బాధ్యత తనదని.. అయితే నీటి సంరోణ ద్వారా భవిష్యత్ తరాలకు మనం నీటి నిల్వలు అందించాల్సి ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బాధ్యతను స్వీకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మంత్రి గడ్కరీ కోరారు. విదర్భ ప్రాంతంలో నీటి నిల్వల ప్రాజెక్టులు చేపట్టి విజయం సాధించామని అన్నారు. వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులు అనే 4 అంశాలు దేశాభివృద్ధిని

మిగతా 2వ పేజీలో..

# రూపాయి అప్పు కూడా పుడుతలేదు..

- రాజకీయ ఉచ్చులో సమిధలు కావద్దు
- సమరం కాదు.. సంయమనం కావాలి
- మీకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం
- కలిసి పని చేస్తేనే తెలంగాణ బలపడుతుంది
- ఉద్యోగ సంఘాల సమ్మె ప్రకటనలపై సీఎం రేవంత్





**హైదరాబాద్,మే5 :**
ఖజానా అంతంతమాత్రంగానే ఉన్నా..ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని, అందుకు ఉద్యోగులు సమరం చేస్తారా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారని ప్రశ్నించారు. తనను కోసినా సరే.. వచ్చిన ఆదాయానికి మించి ఖర్చు చేయలేనని సీఎం స్పష్టం చేశారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ బకాయిలు పెట్టి వెళ్లారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయి. ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా.. సమస్య ఉంటే చర్చించుకుందాని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా అని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి. వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దన్నారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ, ఎక్కడా

మిగతా 2వ పేజీలో..

## ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది

2

- ఉద్యోగాల నియామకాలు..
- బస్సులు కొనుగోలు చేశాం
- అనేక బకాయిలు చెల్లించి మేలు చేశాం
- ఇప్పుడు సమ్మెతో మళ్లీ వెనకపడేయవద్దు
- ఆర్టీసీ కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం సూచన

# మిస్‌వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

- ఎక్కడా లోపం రాకుండా పటిష్ట ఏర్పాట్లు
- మే10 నుంచి 31 వరకు పోటీలపై ప్రత్యేక చర్యలు
- చారిత్రక ప్రాంతాల్లో పర్యటించే వారికి సదుపాయాలు
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి
- 15న పోచంపల్లిని సందర్శించనున్న మిస్ పోటీదారులు
- భారీగా ఏర్పాట్లు చేసిన పర్యాటక శాఖ



**హైదరాబాద్,మే5 :**
మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాలకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా వారికి ఆతిథ్యమివ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. మే 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే ప్రపంచస్థాయి పోటీల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటా పరిచయం చేసేందుకు ఉపయోగపడే మిస్ వరల్డ్ 2025 వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అన్నారు. పోటీదారులతో పాటు దేశ విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు 3000 మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. వివిధ దేశాల నుంచి పోటీలకు వచ్చే వారిని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలని, పోటీలు పూర్తయ్యేంత వరకు ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. పర్యాటక శాఖతో పాటు

మిగతా 2వ పేజీలో..

## రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక

- కసరత్తు మొదలు పెట్టిన ప్రభుత్వం
- సిబిల్ స్కోరు ఆధారంగా లబ్ధిదారుల గుర్తింపు

**హైదరాబాద్,మే5 :**
రాజీవ్ యువవికాసం కింద అందించే రుణాలను జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్దిదారులకు రుణాల మంజూరు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈ నెలాఖరుకు లబ్దిదారుల జాబితాను అంటే అర్హుల జాబితాను సిద్దం చేస్తున్నారు. మొదటి విడతలో సుమారు 5 లక్షల మందికి ఈ పథకం ప్రయోజనం అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బ్యాంకు రుణాలు పొందాలంటే సిబిల్ స్కోర్ బాగుండాలి. ఇప్పుడు రాజీవ్ యువ వికాసం

మిగతా 2వ పేజీలో..



## కుటుంబాన్ని కడతేర్చిన కలహాలు

- ఇద్దరు పిల్లలకు ఉరేసి.. తండ్రి ఆత్మహత్య

3



## ప్రధాని మోడీకి పుతిన్ ఫోన్

3




## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు

- ఇవన్నీ ప్రభుత్వ హత్యలుగానే గుర్తించాలి
- ఎక్కడా ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు
- అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనాలి
- అందాలపోటీపై ఉన్న శ్రద్ధ రైతులపైనా పెట్టండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

**సిద్దిపేట,మే5 :**
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మరణాలకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి బాధ్యులని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గు చేటుని విమర్శించారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం నాడు హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామ ర్శించిన అనంతరం హరీశ్‌రావు

మిగతా 2వ పేజీలో..



## గల్ఫ్‌లో ఉద్యోగం అంటూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కే టోకరా

- కన్సల్టెన్సీపై కేసునమోదు చేసిన పోలీసులు

**వేములవాడ,మే5 :**
ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ఓ మహిళ కాల్ చేసిన ఘటన హాట్ టాపిక్‌గా మారింది. గల్ఫ్ లో మంచి ఆఫర్ ఉందంటూ ఎమ్మెల్యేకు ఓ కన్సల్టెన్సీ మహిళ ఫోన్ చేసింది. నువ్వు ఎవ్వరికి ఫోన్ చేశావో తెలుసా అంటూ ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేతో మహిళ వాగ్వాదానికి దిగింది. మహిళ తీరుపై సదరు ఎమ్మెల్యే ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై జగిత్యాల పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. కన్సల్టెన్సీ మహిళ దుబాయ్, మలేషియా, సింగపూర్ వంటి దేశాల్లో మంచి ఆఫర్స్ ఉన్నాయంటూ పలువురికి ఫోన్ కాల్స్ చేసినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ఎలాంటి లైసెన్స్ లేకుండానే విదేశీ బ్రోకరేజీ కన్సల్టెన్సీగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆఫీస్ సీజ్ చేసి, లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై కేసు నమోదు చేశారు.



## మాక్ డ్రిల్‌లు నిర్వహించండి

3

## రాజీవ్ యువ వికాసం
# లబ్ధిదారుల ఎంపిక

**మొదటి పేజీ తరువాయి**

స్కీమ్‌లో సిబిల్ స్కోర్ కీలకం కానుంది. పథకం ద్వారా ప్రభుత్వ సహాయంతో రుణం పొందాలనుకునే యువతకు క్రెడిట్ స్కోర్‌ను ప్రధాన అర్హతగా నిర్ణయించనున్నారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే లేదా గతంలో రుణాలు తీసుకుని చెల్లించకపోతే వారి దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రుణాల దరఖాస్తులకు ముందు సిబిల్ స్కోర్‌ను తప్పనిసరిగా పరిశీలించనున్న బ్యాంకులు, దానికి సంబంధించి ఫీజు కూడా వసూలు చేయనున్నాయి. ప్రతి దరఖాస్తుకు రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేసే యోచనలో కొన్ని బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి. సిబిల్ స్కోర్ వసూలుపై ప్రభుత్వం స్పందించింది. తక్కువ ఆదాయ వర్గాల అభ్యర్థులపై భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో బ్యాంకులు వసూలు చేసే ఫీజును మినహాయించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ అంశాన్ని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నివేదించనున్నారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 16,25,441 దరఖాస్తులలో అత్యధికంగా బీసీల నుంచి 5,35,666, ఎస్సీల నుంచి 2,95,908, ఎస్టీల నుంచి 1,39,112, ఈబీసీల నుంచి 23,269, మైనారిటీల నుంచి 1,07,681, క్రిస్టియన్ మైనారిటీల నుంచి 2,689 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం మండల స్థాయిలో దాదాపు 70 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు అధికారులు తెలిపారు. తుది జాబితా మే నెలాఖరులో అందుబాటులోకి రానుంది. మండల అధికారులు పరిశీలించిన దరఖాస్తులను బ్యాంకులకు పంపించి అర్హుల ఎంపిక జరుగుతుంది. తుది జాబితా తయారైన తర్వాత అదే కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి అందజేస్తారు.

# రూపాయి అప్పు కూడా పుడుతలేదు..

**మొదటి పేజీ తరువాయి**

అప్పు పుట్టట్లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబం పరువును బజారున పడేయొద్దు. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి, సంయమనం. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హయాం లో సమయానికి జీతాలు రాకున్న నోరు విప్పలేదు.. ఇప్పుడు వాళ్ల అడగకముందే జీతాలు ఇస్తోన్న సమరం చేస్తామంటున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని.. రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దని సూచించారు. రాష్ట్రం పూర్తిగా దివాలా తీసిన స్థితిలో ఉందని.. ఒక్కరూపాయి కూడా అప్పు పుట్టడం లేదని.. బ్యాంకులకు వెళితే దొంగలను చూసినట్లు చూస్తున్నారని అన్నారు. అణాపైసా చిక్కడం లేదని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని చెప్పినా ఎవరూ నమ్మడం లేదన్నారు. కనీసం గ్రామాల్లో రోడ్లు వేయాలనే పరిస్థితి నెలకొందని.. స్వీయ నియంత్రణ మాత్రమే దీనికి పరిష్కారమని తెలిపారు. సరిహద్దుల్లో సైనికుల్లా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి కాబట్టే.. తెలంగాణ రాష్ట్రం ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించగలుగుతోందన్నారు. విధినిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటుంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు, అదనపు ఎస్పీ, ఎస్పీ కుటుంబాలకు రూ. కోటిన్నర ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేరం జరగకుండా నియంత్రించే బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.

# మిస్‌వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

**మొదటి పేజీ తరువాయి**

అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, అధికారులు అంతా సమర్థంగా తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎంతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, డీజీపీ జితేందర్, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, ఏడీజీపీ స్టీఫెన్ రవీంద్రతో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మే 10 నుంచి 31వ తేదీ వరకు వరుసగా జరిగే కార్యక్రమాల షెడ్యూలుకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి కార్యక్రమానికి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని సూచించారు. మే 10వ తేదీన సాయంత్రం హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ ప్రారంభోత్సవం నుంచి 31వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని చార్మినార్, లాడ్ బజార్‌తో పాటు తెలంగాణ తల్లి, సెక్రెటేరియట్ తోపాటు రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్న నేపథ్యంలో అవసరమైన రవాణా, వసతులు కల్పించాలన్నారు. అక్కడ భద్రత కట్టుదిట్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుకోని అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ ప్రణాళికలను అధికారులు రూపొందించుకోవాలని ఆదేశించారు. మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకేపీ మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ సందర్శనతో పాటు, ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ సెమీఫైనల్స్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ లో మిస్ వరల్డ్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ఈదురు గాలులు, వర్షాలు వచ్చినా గ్రేటర్ సిటీ పరిధిలో ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీతో పాటు హైడ్రా విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిస్ వరల్డ్ కు వచ్చే విదేశీ అతిథులు బస చేసే హోటళ్లతో పాటు గచ్చిబౌలి స్టేడియం, చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలెస్, సెక్రెటేరియట్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతో పాటు వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరపున మిస్ వరల్డ్ 2025 ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలు, బీసీ, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా పాఠశాలలకు చెందిన విద్యార్థులను కూడా ఒకరోజు మిస్ వరల్డ్ వేడుకలు చూపించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వేడుకలు జరిగే రోజుల్లో హైదరాబాద్ అంతటా మిస్ వరల్డ్ సందడి కనిపించేలా తోరణాలు, లైటింగ్, హోర్డింగ్‌లతో పాటు సిటీలోని ముఖ్యమైన జంక్షన్లు, చారిత్రక ప్రదేశాలను అందంగా అలంకరించాలని అన్నారు.

**15న పోచంపల్లిlr సందర్శించనున్న మిస్ పోటీదారులు**

హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 పోటీలు జరగబోతున్న సంగతి తెలిసిందే. అయితే ఒక ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలో భాగస్వాములు అవుతున్న మిస్ వరల్డ్ 2025 గ్రూప్ 2 పోటీదారులు మే 15న ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామం పోచంపల్లిని సందర్శించనున్నట్లు పర్యాటక విభాగం అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలలో ఒకటైన పోచంపల్లి ఇక్కత్ పై ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న పోచంపల్లి, దాని సంక్లిష్టమైన ఇక్కత్ నేత పద్ధతులకు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంది. పోచంపల్లిని యునెస్కో ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తించింది. ఇది చేతిపనులు, సంస్కృతి, వారసత్వానికి సజీవ మ్యూజియం. మిస్ వరల్డ్ పోటీదారులు ఇక్కత్ సాంప్రదాయ టైఅండ్‌డై ప్రక్రియను పరిశీలిస్తారు. నిష్ణాతులైన నేత కార్మికులతో సంభాషిస్తారు. అలాగే హైదరాబాద్ నిజాంలు ఒకప్పుడు అభిమానించిన డబుల్ ఇకాట్ కళాఖండం అయిన ఐకానిక్ టెలియా రుమల్ తయారీని చూస్తారు. మిస్ వరల్డ్ వేదిక అపూర్వమైన అంతర్జాతీయ దృశ్యమానతను అందిస్తున్నందున, ఈ ప్రతిష్టాత్మక సందర్శన తెలంగాణ రాష్ట్ర గొప్ప చేనేత వారసత్వాన్ని ప్రపంచ పటంలో ఉంచుతుంది. పోచంపల్లి శక్తివంతమైన నేత, గ్రామీణ హస్తకళ ఇంకా సాంస్కృతిక లోతును ప్రదర్శించడం ద్వారా, ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ఉన్న చేనేత అభిమానులకు భారతదేశ జీవన సంప్రదాయాల శక్తివంతమైన వేడుకగా మారుతుంది. ఈ నెల చివర్లో హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే కోసం అంచనాలు పెరుగుతున్న కొద్దీ, పోచంపల్లి సందర్శన ఒక హైలైట్‌గా ఉండనుంది.

# ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది

* ఉద్యోగాల నియామకాలు.. బస్సుల కొనుగోళ్ల చేశాం
* అనేక బకాయిలను చెల్లించి మేలు చేశాం
* ఇప్పుడు సమ్మెతో మళ్లీ వెనకపడేయవద్దు
* ఆర్టీసీ కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం సూచన



**హైదరాబాద్,మే5:**
కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా ఒక్క బస్సు కొనుగోలు చేయలేదని ,ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సీసీఎస్, పీఎఫ్ పైసలు వాడుకున్నారని విమర్శించారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసి గాడితో పడుతున్న సమయంలో ఆర్టీసీ సమ్మె ప్రతిపాదన సరికాదని అన్నారు. సోమవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఆర్టీసీ సంఘాల నేతలు కలిశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసిన వారిలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ టీఎంయూ
జనరల్ సెక్రెటరీ అశ్వద్ధామరెడ్డి, ఎన్ఎంయూ జనరల్ సెక్రెటరీ నరేందర్, కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామి కుమార్ , ఎస్టీఎంయూ జనరల్ సెక్రెటరీ పున్న హరికృష్ణ, తదితరులు ఉన్నారు. ఆర్టీసీ సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ సంఘాల నేతలు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ సమస్యలపై ఉద్యోగులు ఎప్పుడైనా తనను కలవవచ్చని.. వారికి తానెప్పుడు అందుబాటులోనే ఉంటానని స్పష్టం చేశారు. ఆర్టీసీ సమస్యలు పరిష్కరించడానికి తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం తమ కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం , ప్రయాణికుల సౌకర్యం ఈ మూడిరటికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని..సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. సమ్మె చేయొద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీ అభివృద్ధి కోసం 16 నెలలుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామని.. ఒక్కరినైనా ఇబ్బంది పెట్టలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడిరచారు. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 2013 నుంచి చెల్లించాల్సిన బాండ్ రూ.400 కోట్లు చెల్లించామని తెలిపారు. 2017 ప్రకారం పే స్కేల్ 21 శాతం ఇచ్చామని..సంవత్సరానికి రూ.412 కోట్ల భారం తమ ప్రభుత్వంపై పడుతోందని చెప్పారు. పీఎఫ్ ఆర్గనైజేషన్ సుదీర్ఘకాలంగా పెండిరగ్‌లో ఉన్న రూ.1039 కోట్లు చెల్లించామని వెల్లడిరచారు. నెలవారీ పీఎఫ్ కంట్రిబ్యూషన్ జనవరి 2024 నుంచి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని తెలిపారు. చాలా కాలంగా పెండిరగ్‌లో ఉన్న సీసీఎస్ బకాయిలు ఉద్యోగులకు రూ. 345 కోట్లు చెల్లించామని అన్నారు. 1500 మందిని కారుణ్య నియామకాల కింద విధుల్లోకి తీసుకున్నామని వివరించారు. తమ ప్రభుత్వం టీజీఎస్ ఆర్టీసీలో 3038 మంది ఉద్యోగులను నియమించనుందని చెప్పారు. కొత్త బస్సులు కొనుగోలు చేశామని, తార్నాక ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడిరచారు. ఆర్టీసి కార్మికులు సమ్మెకు పిలుపునివ్వడంతో స్పందించిన మంత్రి పొన్నం.. సమ్మె చేయొద్దని, చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆర్టీసి సమస్యలను ఎప్పుడైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సమస్యలు వినడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. ఆర్టీసి పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. కాగా, తెలంగాణ వ్యాప్తంగా మే 7 నుండి ఆర్టీసి కార్మికుల నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలసిందే. ఆర్టీసి పరిరక్షణ, విలీన పక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ.. మే 6 అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు బంద్ కానున్నట్లు కార్మికులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తోంది.

## తుపాకీ చేతపట్టిన వారితో చర్చలేమిటి

* కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ

**పెద్దపల్లి,మే5 :**
మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదనే విషయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ మేరకు రామగుండంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. తుపాకీ చేతపట్టి అమాయకులను చంపుతుంటే చర్చలేంటని సంజయ్ ప్రశ్నించారు. ఆ చావులకు మీరేం సమాధానం చెబుతారంటూ బండి సంజయ్ ఎదురు ప్రశ్నించారు. కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తోంది. మావోయిస్టులు దశాబ్దాలుగా అమాయకులను కాల్చి చంపిన సంగతి గుర్తు లేదా?, మావోయిస్టుల సానుభూతిపరులు సాధించిందేంటని అన్నారు. వారిపై నిషేధం విధించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని అన్నారు. మావోయిస్టులు ఎవరున్నా తుపాకీ వీడి లొంగిపోవాల్సిందే.. జన జీవన స్రవంతిలో కలవాల్సిందే. పౌర హక్కుల సంఘం నేతలారా.. నక్సల్స్ నచ్చజెప్పండని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు. కేవలం సర్వే మాత్రమే జరిగిందన్నారు. జనగణన మాదిరిగానే మోదీ ప్రభుత్వం కులగణన చేస్తుందన్నారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామన్నారు బండి సంజయ్.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు

**మొదటి పేజీ తరువాయి**

మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ, అన్నదాతల ఆవేదనపై లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అందాల పోటీలపై పోటీపడి సమీక్షలు నిర్వహిస్తున్న నాయకులకు, కొనుగోలు కేంద్రాల్లోనే కుప్పకూలుతున్న రైతన్నల గుండె కోత వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. సాగునీళ్లు అందించడంలో, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో, కొనుగోలుచేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా ధాన్యం కొనలేదని.. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూస్తూ రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని హరీశ్‌రావు తెలిపారు. ధాన్యం కుప్పలపైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 15న జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూలూరు వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో జలపతిరెడ్డి అనే రైతు మృతి చెందాడని, ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో హనుమండ్ల ప్రేమలత అనే మహిళా రైతు హఠాన్మరణం చెందిందని, ఏప్రిల్ 22న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి కొనుగోలు కేంద్రంలో బీరు వెంకన్న ప్రాణాలు కోల్పోయాడని, ఏప్రిల్ 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం నేర్పుతూ చింతకింది హనుమయ్య కుప్పకూలాడని తెలిపారు. ధాన్యపు రాశులే సాక్ష్యంగా, కొనుగోలు కేంద్రాల్లోనే జరుగుతున్న ఈ రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. ఇవి సహజ మరణాలు కావు, ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగినవే అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఈ మరణాలకు బాధ్యులు అని అన్నారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం, వారి ప్రాణాల మీదకు తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీళ్లు అందించడంలో వైఫల్యం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో వైఫల్యం, కాంటాలు పెట్టడంలో వైఫల్యం, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం, బడాయిగా చెప్పిన బోనస్ అందజేయడంలో ఘోర వైఫల్యమని హరీశ్‌రావు అన్నారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులు ప్రాణులు కోల్పోతుంటే ఏం ముఖం పెట్టుకొని వేడుకలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండంగా గడుపుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం ధాన్యం కొనుగోళ్ల పక్రియ ప్రహసనంగా మారిందని అన్నారు. ధాన్యం అమ్మిన డబ్బులు 10 రోజులు దాటుతున్నా రైతులకు చెల్లించడం లేదని తెలిపారు. ధాన్యం డబ్బులు 48 గంటల్లోనే చెల్లించాలని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన మాటలు ఉత్త మాటలే అయ్యాయని అన్నారు. 70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటి వరకు 24.43 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని అన్నారు. దీని విలువ రూ. 5664 కోట్లుత అని.. చెల్లించింది మాత్రం రూ. 3163 కోట్లు అని పేర్కొన్నారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ, తడిచిన ధాన్యం వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం, పది రోజుల నుంచి కొనుగోలు పక్రియ జరగడం లేదని విమర్శించారు. మార్కెట్లో వంద లారీలు ధాన్యం తడిసిపోయి ఉన్నాయని, వడ్ల కుప్పల మీదనే రైతులు ప్రాణాలు వదులుతున్నారని హరీష్ రావు అన్నారు. అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ ఈ ప్రభుత్వానికి రైతుల మీద లేదని విమర్శించారు. అందాల పోటీలు అన్నం పెడతాయా అని ప్రశ్నించారు. పత్తి రైతులకు జరిగిన అన్యాయంపై సీబీఐ చేత విచారణ జరపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. 48 గంటల్లో వడ్ల పైసలు ఇస్తున్నామని చెబుతున్న మంత్రి నిరూపిస్తారా అని సవాల్ చేశారు. పది రోజులలోపు పైసలు రాడమే లేదన్నారు. బోనస్ అని గొప్పగా చెప్పి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రైతు బంధు, రైతు బీమా ఆగిపోయిందని.. తక్షణమే రైతు బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేవుడు, చర్చి, దర్గా మీద సీఎంకు నమ్మకం ఉంటే రుణ మాఫీ డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ప్రభుత్వానికి పరిపాలన సరిగా చేయడంలేదని, పాలన గాలిలో దీపంలా మారిందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేల ఇన్పుట్ సబ్సిడీ అందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పత్తి రైతులకు ప్రభుత్వం మోసం చేసింని అన్నారు. ఈఈఓ అధికారులతో కలిసి పత్తి రైతులను ముంచి 3500 కోట్ల కుంభకోణం చేశారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించిన తర్వాత విజిలెన్స్ ఎంక్వయిరీ వేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం సహా, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా పాలకుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదని మండిపడ్డారు.

# తెలంగాణ రోడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**మొదటి పేజీ తరువాయి**

నిర్దేశిస్తాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సభావేదికపై నుంచి జాతీయ రహదారులను ఆయన ప్రారంభించారు. రూ.3,900 కోట్ల విలువైన పనులను మొదలుపెట్టి మాట్లాడారు.ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక పైనుంచే 7 జాతీయరహదారులు ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని, భూమికోసం, భుక్తి కోసం.. జిల్లా ప్రజలు ఎన్నో పోరాటాలు చేశారని, ఆదిలాబాద్ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిరదని, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. చీకటి ఉండే చోట వెలుగులు నింపాలని, తనకు 13 డాక్టరేట్లు ఉన్నాయని.. తాను ఇంజనీరును కానని, అయినా 13 డాక్టరేట్లు ఉన్నాయని నితిన్ గడ్కరీ చెప్పారు. ఇక్కడి ప్రజల సమస్యలు అర్థం చేసుకునే రోజు వచ్చిందని అన్నారు. పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని, రోడ్లు బాగున్న దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని అన్నారు. భద్రాద్రి, బాసర, మేడారం ఆధ్యాత్మిక క్షేత్రాలు హైవేతో అనుసంధానం చేస్తామని చెప్పారు. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మిస్తామన్నారు. నాగపూర్ నుంచి విజయవాడ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. జగిత్యాల కరీంనగర్ హైవే విస్తరణ వేగవంతం చేస్తామని, వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులే దేశాభివృద్ధి అని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని చెప్పారు. రహదారులు మెరుగ్గా ఉండే దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ సందర్భంగా అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఆదివాసీల జిల్లా ఇది అని కొనియాడారు. రాష్ట్రాల మధ్య అనుసంధానం పెంచేందుకు కీలకమైన ప్రాజెక్టును కేంద్రం చేపట్టింది. రోడ్డు కనెక్టివిటీలో భాగంగా క్లిష్టమైన వంతెనలు, సొరంగ మార్గాలు నిర్మిస్తున్నాం. జోజిలా పాస్ టన్నెల్ వంటి నిర్మాణాలను చేపట్టాం. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించనున్నాం. నాగ్‌పూర్ నుంచి విజయవాడ కారిడార్ చేపట్టాం. తెలంగాణమహారాష్ట్ర మధ్య రోడ్డు కనెక్టివిటీ మరింత పెరగనుంది. భద్రాచలం, బాసర, మేడారం వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తాం. జగిత్యాలకరీంనగర్ హైవే విస్తరణ పనులను త్వరలోనే చేపడతాం. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టాం. అంబర్‌పేట్‌లో నిర్మించిన పైవంతెనను ఇవాళే ప్రారంభించు కోనున్నాం. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. పెట్రోల్ వాహనాలకు బదులుగా విద్యుత్ వాహనాలు ఇంకా పెరగాలి. వీటితో రవాణా ఖర్చు బాగా తగ్గుతుందని నితిన్ గడ్కరీ తెలిపారు. స్మార్ట్ సీటీలు కాదు...స్మార్ట్ విలేజ్‌లను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. వచ్చే నాలుగేళ్లలో తెలంగాణలో రెండులక్షల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ కోసం రాబోయే రోజుల్లో లక్ష కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. గడ్చిరోలీ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. రైతులు ఆత్మహత్యచేసుకున్న విదర్భలో తాము పనిచేశామని చెప్పారు. చీకటి ఉండే చోట వెలుగులు నింపాలన్నారు. వెనుకబడిన జిల్లాలో అభివృద్ధి కోసం మేం పనిచేస్తున్నాం. అమృత్ సరోవర్ పేరుతో నీటి నిల్వలు పెంచుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే మేం నీటి నిల్వలు పెంచేందుకు సిద్ధం. తెలంగాణలో కూడా అలా నీటి సరస్సులను గుర్తిస్తే మేం అభివృద్ధి చేస్తాం అని గడ్కరీ హామీ ఇచ్చారు. మీ సమస్యలను అర్థం చేసుకునే అవకాశం వచ్చింది. రోడ్డు బాగుంటేనే అమెరికా ధనిక దేశం అయింది. తెలంగాణలో కూడా రోడ్లు బాగుంటేనే ధనిక రాష్ట్రం అవుతుందన్నారు. నీరు, ఇంధనం, రవాణా, కమ్యునికేషన్, ఏఐతో ఏ ప్రదేశమైనా అభివృద్ధి జరుగుతోంది. .శ్రీనగర్, జమ్మూలో 36 టన్నెల్స్ నిర్మిస్తున్నాం. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం, ఆర్‌ఎస్‌ఎస్ లో ఉన్నప్పుడు ఆదివాసీలతో కలిసి పనిచేశాం. యువకులకు ఉద్యోగాలు, రైతులకు మద్ధతు ధర దక్కాలి. జగిత్యాల వరంగల్ హైవేకు రూ.1000 కోట్లు కేటాయించాం అని నితిన్ గడ్కరీ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, బండి సంజయ్, కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, ఎంపీ గోడం నగేశ్, వంశీ, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, పాల్వాయి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికల సమయంలోనే రాజకీయాలు**

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉంటాయని... అభివృద్ధి విషయంలో కాదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్రాలఅభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధాని మోదీ నమ్ముతారని అన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి అభివృద్ధిలో ముందుకు సాగితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గత పదేళ్లలో తెలంగాణలో హైవేల విస్తీర్ణం 5,100 కి.మీ.కు చేరుకుందని ఆయన అన్నారు. మంత్రి కోమటిరెడ్డి బోళ మంత్రి..మనసులో ఏమి ఉంచుకోడు.. ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మహారాష్ట్ర బార్డర్ లో నేషనల్ హైవేకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్. రూ. 3526 కోట్లతో 95 కిలోమీటర్ల మేర ఫోర్ లైన్స్ నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. ఆదిలాబాద్ అనగానే వెనుబడిన అనే అపోహ ఉండేది కానీ.. ఆదిలాబాద్ లో రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. అయితే ఆదిలాబాద్‌ను వెనకబడేశారని అన్నారు. గత పాలకులకు ఈ జిల్లాను పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ రాకముందు 2500కి.మీ రహదారులు హైవే ఉండేది. బీజేపీ అధికారంలోకి వచ్చాక 5100 కి.మీ నేషనల్ హైవేలు నిర్మించాం. దేశంలోని జాతీయరహాదారుల కోసం లక్షా 20 వేల కోట్లు కేటాయించాం. తెలంగాణకు కేంద్రం రూ. 12 లక్షల కోట్లు కేటాయించింది. రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలి. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం విశ్వ గురువు అవుతుంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేసేందుకు కేంద్రం సిద్ధం. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే రహదారులు సరిగా లేవు. రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా నిర్మించేందుకు కేంద్రం రెడీగా ఉంది. రాజీవ్ రహదారి నిర్మించిన కాంట్రాక్టర్ సమస్యను పరిష్కరించాలి. రాజీవ్ రహదారిని మంచిర్యాల వరకు పొడిరచాలని కోమటిరెడ్డిని కోరారు. నితిన్ గడ్కరీ ఎవరు ఏది అడిగినా ఇస్తారని బండి సంజయ్ అన్నారు.

**కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరు రోడ్డు కనెక్టివిటీ**

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీనే లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో రూ. 3,694.4 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు జరిగాయని, హైవేల విస్తరణ వల్ల రోడ్డు ప్రమదాలు తగ్గాయని.. సమయం తగ్గిందని అన్నారు. తెలంగాణలో హైవేల నిర్మాణ పనులకు...కేంద్రం రూ. 1.25 లక్షల కోట్లు కేటాయించిందని తెలిపారు. క రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హైవేల విస్తీర్ణం 5 వేల కిలోమీటర్లు దాటిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గడ్కరీతో కలసి ఆయన కాగజ్‌నగర్ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాటల్‌ఆడుతూ.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీని పెంచడం మోదీ సర్కార్ లక్ష్యమని అన్నారు. తెలంగాణలో జాతీయ రహదారుల విస్తీర్ణం 5వేల కి.మీ దాటిందని చెప్పారు. జాతీయ రహదారుల విస్తరణ వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రయాణ సమయం భారీగా తగ్గాయి. రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కేంద్రం అంకితభావంతో పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా 7 టెక్స్‌టైల్ పార్కులు మంజూరు చేస్తే తెలంగాణకు కూడా ఒకటి దక్కింది. రూ.6,330 కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి పరిశ్రమను పునరుద్ధరించుకున్నాం. ఇచ్చిన హామీ ప్రకారం నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు మంజూరు చేశాం. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు ప్రారంభించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. దేశంలో 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని మోదీ ప్రభుత్వం అందజేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# మాక్ డ్రిల్‌లు నిర్వహించండి

రాష్ట్రాలకు హోంశాఖ ఆదేశాలు



న్యూఢిల్లీ, మే5: పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని రాష్ట్రాల్రకు కీలక ఆదేశాలు జారీ చేసింది. శత్రు దాడి జరిగినప్పుడు సంసిద్ధంగా ఉండేందుకు మే 7 నుంచి పౌర రక్షణ మాక్ డ్రిల్‌లు నిర్వహించాలని సూచించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మాక్ డ్రిల్ ద్వారా వైమానిక దాడుల సైరన్‌లను పరీక్షించడం, పౌరులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, బ్లాక్‌అవుట్ చర్యలను అమలు చేయడం వంటి మొదలైన కీలక కార్యకలాపాలు నిర్వహిస్తారు. దాయాది దేశంతో ఉద్రిక్తలు పెరుగుతుండటంతో దేశంలో వైమానిక దాడులపై అవగాహన పెంచేందుకు మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర హోం శాఖ రాష్ట్రాల్రను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న స్థానిక అధికారులు, విద్యా సంస్థలు, పౌరులకు ఎమర్జెన్సీ వేళల్లో ఎలా స్పందించాలో అవగాహన కల్పించాలని నొక్కి చెప్పింది. శత్రుదేశాలు దాడి చేస్తే ఎలా స్పందించాలి.. అత్యవసర పరిస్థితుల్లో తమను తాము ఎలా కాపాడుకోవాలో మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు శిక్షణ ఇస్తారు.



# ప్రధాని మోడీకి పుతిన్ ఫోన్

- ఉగ్రవాదంపై పోరులో అండగా ఉంటామని హామీ
- మోడీతో రక్షణశాఖ కార్యదర్శి అత్యవసర భేటీ

**న్యూఢిల్లీ, మే5:**

భారత్-పాక్ ఉద్రిక్తల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్ ద్వారా సంభాషించారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిరచిన పుతిన్, ఉగ్రవాదంపై భారత్ జరుపుతోన్న పోరాటంలో తమ పూర్తిమద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇరుదేశాల మధ్య ఉన్న ప్రత్యేక,వ్యూహాత్మకభాగస్వామ్యాన్ని మరింత బలపేతం చేసేందుకు కట్టు-బడి ఉన్నామని మోదీ, పుతిన్ పునరుద్ఘాటించారు. మే 9న రష్యా విక్టరీ డేను నిర్వహించుకోనుంది. దీనిపై అధ్యక్షుడికి మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ ఏడాది రెండుదేశాల మధ్య వార్షిక సదస్సు భారత్‌లో నిర్వహించనున్నారు. అందుకోసం మన ప్రధాని ఆహ్వా నం పలకగా.. పుతిన్ అంగీకరించారు. ఈ విషయాలను మన విదేశాంగ శాఖ వెల్లడిరచింది. ఇదిలావుంటే పహ ల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ సంబంధా లు భగ్గుమన్నాయి. అలాగే తదుపరి చర్య లపై కేంద్ర ప్రభుత్వం పలు కీలక భేటీలు నిర్వహిస్తోంది. ఈ సమయంలో ప్రధాని నరేంద్రమోదీతో రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ- జరిగింది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు ఈ భేటీలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చా రు. లక్ష్యాలు , దాడి సమయం అవి నిర్ణయిస్తాయని అప్పుడు సీసీఎస్ వెల్లడిరచింది. ఇటీ-వల సన్నద్ధతలో భాగంగా యూపీ లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ విన్యాసాలను నిర్వహించింది. ఇక వరుసగా నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె.త్రిపా ఠి, తర్వాత ఎయిర్ చీఫ్ మార్షల్ అమ ర్‌ప్రీత్ సింగ్.. మోదీతో భేటీ అయ్యారు. ఈ క్రమంలో రక్షణశాఖ కార్యదర్శి సమా వేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉగ్రదాడి తర్వాత భారత్ ఇప్పటివరకు సైనికంగా బదులివ్వకపోయినా.. పాకిస్థాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధిస్తోంది. సింధునది జలాలను అడ్డుకోవడం ద్వారా ఇప్పటికే పొరుగుదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయగా తాజాగా.. బగలిహార్ జలాశయం నుంచి నీటి సరఫరాను భారత్ నిలిపివేసింది. విద్యుదుత్పత్తికి ఉద్దేశించిన ప్రాజెక్టు నుంచి నీరు వదలకపోవడం వల్ల పాక్‌లోని పంజాబ్ ప్రావిన్సుకు సాగునీరు నీరందడం లేదు.

# ఉగ్రదాడిపై మనకేం సంబంధం

- భారత్ విమానాలను కూల్చేయాలన్న ఎంపి ఒమర్
- దాడికి దిగితే ధీటుగా జవాబిస్తామన్న ఆర్మీ చీఫ్

ఇస్లామాబాద్,మే5 : పహల్గాం ఉగ్రదాడిపై పాక్ జాతీయ అసెంబ్లీలో వాడివేడి చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్ష నేత, పీటీఐ మద్దతుతో గెలిచిన ఎంపీ ఒమర్ అయూబ్ భారత్‌పై విషం కక్కారు. యుద్ధోన్మాదంతో ఊగిపోతూ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం దాడిపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చర్చ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు న్యూఢల్లీకి దాసోహం అన్నట్టుగా ఉన్నాయని ఆక్షేపణ తెలిపారు. దాడితో పాక్‌కు సంబంధం లేదన్నారు. భారత్‌పై దాడిచేసి వారి విమానాలు నేలకూల్చాలన్నారు. పహల్గామ్ మనకు ఎంతో దూరం..అక్కడకి వెళ్లి మనమెలా దాడి చేస్తామని అన్నారు. ఇదిలా వుంటే ఈ నేపథ్యంలో పాక్ పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తమ దేశంపై ప్రతీకార చర్యలకు పాల్పడితే.. దానికి దీటుగా బదులిస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. భారత్ నుంచి ఏదైనా దాడి జరిగిన వెంటనే తమ సైన్యం చురుగ్గా ప్రతిస్పందిస్తుందని మునీర్ వ్యాఖ్యానించారు. తాము ప్రాంతీయ శాంతికి కట్టుబడి ఉన్నప్పటికీ..జాతీయ ప్రయోజనాలను, దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడానికి తమ సైనికులు సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే.. పహల్గాం దాడికి వారం రోజుల ముందు మునీర్ పాకిస్థాన్‌లో చేసిన కశ్మీర్‌పై చేసిన ప్రసంగమే కారణమై ఉండొచ్చని భారత నిఘా వర్గాలు అనుమానం వ్యక్తం చేశాయి. ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో ఆయన మాట్లాడుతూ.. 'మన ఉద్దేశం స్పష్టం. కశ్మీర్ గతంలోనూ మన జీవనాడిలా ఉండేది. భవిష్యత్తులోనూ ఉంటుంది. దానిని మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరుల పోరాటంలో.. వారిని ఒంటరిగా వదిలేయం. మన జీవితంలోని ప్రతి అంశంలోనూ హిందువుల కంటే భిన్నమని భావించిన మన పూర్వీకుల ఆలోచనలను అప్పుడే వారు గుర్తుంచుకుంటారు. మన మతాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు భిన్నమైనవి. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. మనవి రెండు దేశాలు' అని మునీర్ వ్యాఖ్యానించారు. ఆ తర్వాతే పహల్గాం దాడి చోటుచేసుకుంది. అదే సమయంలో పాక్ వాయుసేనకు చెందిన రవాణా, నిఘా విమానాలను కరాచీ నుంచి లాహోర్, రావల్పిండి బేస్‌లకు తరలించడం అనుమానాలను బలపరుస్తోంది. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై దాడి జరిగినప్పుడు మునీర్ పాక్ నిఘా సంస్థ ఐఎస్‌ఐ అధిపతిగా ఉన్నారు. ఆ దాడి ఆయన కనుసన్నల్లోనే జరిగిందని చెబుతారు. ఇప్పుడు ఆయనే ఆర్మీ చీఫ్ కావడంతో భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూకను ఉసిగొల్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

# నీట్ పరీక్ష రాసి... ర్యాంక్ రాదేమోనన్న భయం

- ఇంటికి వచ్చి ఉరేసుకుని యువతి ఆత్మహత్య

జగిత్యాల,మే5: జిల్లాలోని చల్‌గల్ గ్రామానికి చెందిన జంగాపూజ 18) అనే విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడిరది. నీట్ పరీక్ష రాసిన ఆమె.. పేపర్ ను క్రాస్ చెక్ చేసుకున్న తర్వాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండేళ్ల క్రితం రాసిన నీట్ పరీక్షలో ర్యాంకు రాకపోవడంతో రెండోసారి తాజాగా నీట్ పరీక్ష రాసింది. అయితే ఇంటికి వచ్చిన తర్వాత పేపర్ ను క్రాస్ చెక్ చేసుకుని ర్యాంకు రాదనే ఆందోళనలో పడిరది. ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల జిల్లాలోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నాచుపల్లి జేఎన్టీయూ కేంద్రాన్ని కలెక్టర్ సత్య ప్రసాద్ తనిఖీ చేశారు. అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులు ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నట్లు- తెలిపారు. జిల్లాలోని ఒక సెంటర్‌లో 480, రెండో సెంటర్లో 278 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. ఒక కేంద్రంలో 13 మంది, మరో కేంద్రంలో ఐదుగురు గైర్హాజరైనట్లు- వివరించారు. ఇకపోతే జేఎన్టీయూ పరీక్ష కేంద్రం తెలియక మూడు నిమిషాలు ఆలస్యంగా చేరుకున్న ఓ విద్యార్థిని పరీక్ష దూరమైంది. మల్లాపూర్ మండలం వీవీ.రావుపేటకు చెందిన సీహెచ్.నవ్యకు జేఎన్టీయూ కేంద్రం పడిరది. దీంతో ఆమె కుటు-ంబ సభ్యులతో కలిసి బయల్దేరింది. ఇంజినీరింగ్ కళాశాల అడ్రస్‌పై అవగాహన లేక దిగువ కొండగట్టు- వరకు వెళ్లారు. పూర్తి అడ్రస్ తెలుసుకుని వెళ్లే సరికి మూడు నిమిషాలు ఆలస్యం కావడంతో అక్కడున్న సిబ్బంది లోపలికి అనుమతించలేదు. గతంలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నా.. ఆశించిన ఫలితం రాలేదని, మరోసారి పరీక్షకు సన్నద్ధమైన రాయలేకపోయాయని ఆవేదనతో తిరిగి వెళ్లిపోయింది.




# తెలంగాణలో పలుచోట్ల భూప్రకంపనలు

**హైదరాబాద్,మే5 :** తెలంగాణలో పలుచోట్ల భూప్రకంపనలు చోటు-చేసుకున్నాయి. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్ పై 3.2 నమోదు అయినట్లు- అధికారులు తెలిపారు. కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో భూమి కంపించినట్లు- సమాచారం అందుతోంది. ఈ భూ ప్రకంపనలు కరీంనగర్, వేములవాడ, సిరిసిల్ల సుల్తానాబాద్ లో వచ్చినట్లు- తెలుస్తోంది. అలాగే నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం, జన్నారంలో కూడా భూమి కనిపించినట్లు- తెలుస్తోంది. భూమి ఒక్కసారిగా ప్రకంపించడంతో ఇళ్లలో నుంచి ప్రజలు బయటికి పరుగులు తీశారు. అయితే ఆస్థి, ప్రాణ నష్టం లాంటి సంఘటనలు జరగలేదు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కుటుంబాన్ని కడతేర్చిన కలహాలు


## ఇద్దరు పిల్లలకు ఉరేసి..తండ్రి ఆత్మహత్య



సంగారెడ్డి,మే5 : క్షణికావేశం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. కలహాల కారణంగా కు టుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. జీవితాలు అర్థాం తరంగా ముగిసిపోతున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలకు ఉరివేసి తాను ఉరివేసుకుని తండ్రి సుభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుం చి దుర్వాసన రావడంతో ఇంటి ఓనర్ కి స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకుని డోర్ పగలగొట్టి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాలు లభ్యమయ్యాయి. భార్య మంజు(35) కి వేరొకరితో వివాహేతర సంబంధం ఉన్నట్టు సమాచారం. ఈ కారణంతో గత కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగు తున్నాయని అరోపణపలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో పిల్లలతో కలిసి సుభాష్(40) ఉంటున్నాడు. మానసిక వేదనకు గురైన సుభాష్ చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. కుమారుడు రిథిక్ మర్యాన్(09), కుమార్తె ఆరా(05)కి ఉరివేసి...అనంతరం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డు. ముగ్గురి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఉగ్రదాడి మృతుడి భార్యపై ట్రోల్

ఘాటుగా స్పందించిన మహిళా కమిషన్



**న్యూఢిల్లీ,మే5 :** పహల్గాం ఉగ్రదాడి మృతుడి భార్యను నెట్టింట్లో ట్రోల్ చేస్తున్నారు. దీనిపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించిం ది. ఆమె సైద్ధాంతిక వ్యక్తీకరణను తప్పుపడుతూ ట్రోల్ చేయడం సరికాదని ఆ ట్రోలింగ్‌ను ఖండిరచింది. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి ఘటనలో మృతి చెందినవారిలో నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఒక వర్గం వారిని టార్గెట్ చేసేలా వ్యాఖ్యలు చేయొద్దంటూ ఆయన సతీమణి హిమాన్షి విజ్ఞప్తి చేశారు. ఇది కొందరు నెటిజన్లకు రుచించలేదు. దాంతో ఆమెను విమర్శిస్తూ ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. ఆమెను ఉద్దేశించి కామెంట్లు- చేయ డం ఏమాత్రం తగదని, దీనిపై కేంద్రం స్పందించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ తరుణంలోనే మహిళా కమిషన్ నుంచి స్పందన వచ్చింది. పహల్గాం ఉగ్రదాడిలో ఎన్నో కుటుంబాలకు తీరనిలోటు ఏర్పడిరది. లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను కూడా మతం పేరు అడిగి, ప్రాణాలు తీశారు. ఉగ్రఘటనపై దేశం మొత్తం ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలో ఆయన భార్య హిమాన్షి నర్వాల్ వ్యక్తంచేసిన అభిప్రాయంపై సోషల్ మీడియాలో వస్తోన్న విమర్శలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, జాతీయ కమిషన్ ప్రతి మహిళ గౌరవాన్ని కాపాడే దిశగా చర్యలు తీసుకునేందుకు కట్టుబడి ఉందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. హరియాణాకు చెందిన వినయ్-హిమాన్షి వివాహం ఏప్రిల్ 16న జరిగింది. 19న విందు నిర్వహించారు. అనంత రం భార్యను తీసుకొని జమ్మూకశ్మీర్‌కు హనీమూ న్‌కు వెళ్లారు. వారం కూడా గడవక ముందే.. తన కళ్ల ముందే జీవచ్ఛవంలా మారిన భర్తను చూసి హతాశురాలైంది. అంత్యక్రియల సమయంలో భర్తకు సెల్యూట్ చేస్తూ ఆమె రోదించిన తీరు ప్రతిఒక్కరిని బాధించింది.

# ప్రధాని కార్యాలయానికి రాహుల్

సీబీఐ డైరెక్టర్ ఎంపికపై భేటీ



న్యూఢిల్లీ,మే5 : ప్రధానమంత్రి నరేంద్రమోదీతో కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్లో విపక్ష నేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ప్రధాని మోదీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా సీబీఐ డైరెక్టర్ ఎంపికపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అటు పహల్గాం దాడికి సంబంధించి పాకిస్థాన్ తో అనుసరించాల్సిన విషయాలపై కూడా వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్టు- సమాచారం. వీటితో పాటు పలు కీలక అంశాలు కూడా ఇరువురు నేతల మధ్య చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. సోమవారం సాయంత్రం రాహల్ ప్రధాని కార్యాలయానికి వెళ్లారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కొత్త చీఫ్‌ని ఎంపిక చేసేందుకు నిర్వహించిన భేటీలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని కార్యాలయంలో నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన సీబీఐ డైరెక్టర్ నియామక కమిటీ- సమావేశానికి రాహుల్‌తో పాటు- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా హాజరయ్యారు. ప్రస్తుత సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలం మే 25న ముగియనున్న తరుణంలో కొత్త చీఫ్ ఎంపికపై చర్చించినట్లు- తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల నియామక కమిటీ-లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం సీబీఐ డైరెక్టర్ నియామకాన్ని చేపడుతుంది.

# సింధూనది ప్రాజెక్టుల సామర్థ్యంపెంపు

## గుట్టుచప్పుడు కాకుండా వేగంగా పనులు

**న్యూఢిల్లీ,మే5 :**

పహల్గాం ఉగ్రదాడికి భారత్ ఇప్పటికే ప్రతీకార చర్యలు మొదలుపెట్టింది. ఇప్పటికే బాగ్‌లిహార్ డ్యామ్ నీటిని ఆపేయగా.. తాజాగా సలాల్ డ్యామ్ ను కూడా మూసివేసింది. ఈ రెండు హైడ్రోపవర్ ప్రాజెక్టుల రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పనులు మొదలుపెట్టినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ కథనం వెలువరించింది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో.. దీనికి సంబంధించిన సమాచారాన్ని పాక్‌కు వెల్లడిరచలేదు. తొలిసారి ఆ ఒప్పందానికి భిన్నంగా భారత్ తీసుకొన్న తొలి చర్యగా నిపుణులు చెబుతున్నారు.

గత గురు వారం నుంచి ఒక రిజర్వాయర్‌లో బురదను తొలగించేందుకు ఫ్లషింగ్ పక్రియను మొదలుపెట్టింది. దాదాపు మూడు రోజులపాటు ఇది కొనసాగిం ది. ఈ పనులను ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పీసీ చూసుకొంటోంది. కాక పోతే పాక్‌కు ఇప్పటికిప్పుడు నీటి సర ఫరా పూర్తిగా నిలిపివేయడం సాధ్యం కాకపోయినా.. భవిష్యత్తులో మాత్రం సమస్యలు ఎదురు కావచ్చని నిపుణులు చెబుతున్నారు. సింధు జలాల ఒప్పందం కిందకు వచ్చే నదులపై ఇలాంటివి దాదాపు అరడజను ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిల్లో నిల్వ సామర్థం పెంచితే మాత్రం పాక్‌కు నీటి కరవు తప్పదు. బురదను, నీటిని బయటకు పంపే ఫ్లషింగ్ ప్రక్రియ కారణంగా విద్యుత్తును మరింత సమర్థవంతంగా ఉత్పత్తి చేసే అవకాశంతో పాటు.. టర్బైన్ దెబ్బతినకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయ డంతో.. పాక్‌కు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం భారత్‌కు లేదు. మన ప్రాజెక్టుల్లో ఇష్టం వచ్చిన మార్పులు చేసుకోవచ్చని సెంట్రల్ వాటర్ కమిషన్ మాజీ అధిపతి కుష్వీందర్ వోహ్రా పేర్కొన్నారు. ఇక ఈ ఒప్పందాన్ని భారత్ నిలిపివేస్తే.. ఎదుర్కొనేందుకు పాక్ వద్ద పరిమిత ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి. ఈ ఒప్పందానికి మధ్యవర్తి అయిన ప్రపంచ బ్యాంక్ వద్దకు వెళ్లడం తప్ప మిగిలిన వాటివల్ల దానికి పెద్దగా ప్రయోజనం లేదు.

## నల్ల పోచమ్మ నాటకానికి విరాళాలు



**శెనార్తి మీడియా, గన్నేరువరం**

గునుకుల కొండాపూర్ గ్రామంలో నిర్వహించిన నల్ల పోచమ్మ నాటక ప్రదర్శనకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి రూ.5000, బొడ్డు సునీల్ రూ.2000 విరాళంగా అందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు న్యాలపట్ల కనుకయ్య, వోడ్నాల నరసయ్య, చంద్ర రెడ్డి, మాజీ సర్పంచులు చింతలపల్లి నరసింహారెడ్డి, ముసుకు కరుణాకర్ రెడ్డి, దుడ్డు మల్లేశం, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు లింగంపల్లి హరి, కొండాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, సముద్రాల జానీ, నల్ల పోచమ్మ కమిటీ అధ్యక్షుడు జాగిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి న్యాలపట్ల శంకర్ గౌడ్, ముఖ్య సలహాదారు కోర్వి కొమురయ్య, గొల్లపల్లి బాలయ్య తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తులు త్వరితంగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**శెనార్తి మీడియా, కరీంనగర్**

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను అధిక ప్రాధాన్యతతో, త్వరితగతిన పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్‌తో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారని, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను కూడా ప్రాధాన్యతనిస్తూ తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఈరోజు మొత్తం 348 దరఖాస్తులు అందగా, వాటిని వెంటనే సంబంధిత శాఖలకు బదిలీ చేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, డిటిడిఓ పవన్ కుమార్, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రౌండింగ్ వర్క్స్ త్వరితగతిన పూర్తి చేయాలి



**శెనార్తి మీడియా, కరీంనగర్**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వెటర్నరీ ఉపకేంద్రాల్లో మంజూరైన మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన గ్రౌండింగ్ వర్క్స్‌ను ఈ నెల 31వ తేదీలోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా శాఖాధిపతులు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించిన ఆమె, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే, రాజీవ్ యువ వికాస యోజన దరఖాస్తుల పరిశీలన తక్షణమే పూర్తిచేసి బ్యాంకులకు పంపించాలని, ఇందిరమ్మ ఇండ్లలో అనర్హులకు మంజూరు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ నుండి మంజూరైన పనుల వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, డిటిడిఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.అనంతరం గృహ నిర్మాణ సంస్థలో కొత్తగా నియమితులైన 11 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు కలెక్టర్‌ను కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం**

మండల పరిధిలోని తాడికల్ గ్రామానికి చెందిన గంట గణేష్ నరాల కొమురయ్య ద్విచక్ర వాహనంపై హుజురాబాద్ నుండి తాడికల్ కు వెళుతుండగా మార్గమధ్యంలో ఈదురుగాలులు వర్షం రావడంతో బైకు అదుపుతప్పి మార్గమధ్యంలో కేశ వపట్నం రోడ్డుపై పడడంతో ఇద్దరికీ త్రివ గాయాలయ్యాయి. వాహనదారుల సమాచారంతో 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందిస్తూ కరీంనగర్ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది.



# రైతులకు నష్టపరిహారం అందించాలి

- ఎకరానికి రూ.50 వేలు ఇవ్వాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి డిమాండ్

**శెనార్తి మీడియా, చిగురుమామిడి**

మండలంలో ఇటీవల అకాల వర్షాలతో మామిడి తోటల కాయలు నేలరాలిపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, వారికి ప్రభుత్వం వెంటనే సహాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలం లోని ముదిమాణిక్యం, గుణుకులపల్లి, గాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వర్షంతో దెబ్బతిన్న మామిడి తోటలను, తడిసిన వరి ధాన్యాన్ని, మొక్కజొన్న పంటలను పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో పరిశీలించారు.ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పంట చేతికి వచ్చే సమయానికి భారీ నష్టం వాటిల్లిందని, మండలంలోని గ్రామాలన్నీ గాలివాన బీభత్సానికి గురయ్యాయని చెప్పారు. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి, ఇండ్లకు హానీ జరిగినట్టు పేర్కొన్నారు.ముదిమాణిక్యం గ్రామంలో జక్కుల రవి, జక్కుల మహేష్‌లకు చెందిన 10 ఎకరాల మామిడి తోట, గాగిరెడ్డిపల్లిలో మాజీ ఉపసర్పంచ్ అన్నాడి నరసింహారెడ్డికి చెందిన 150 చెట్ల మామిడికాయలు పూర్తిగా నేలరాలిపోయినట్టు వివరించారు. అలాగే దేవనూరి సదానందం, అనిల్ కుమార్, గుణుకులపల్లి గ్రామానికి చెందిన కరివేద కిషన్ రెడ్డి, కూన రామస్వామి, ఉప్పుల భూపతిరెడ్డిల తోటల్లోనూ తీవ్ర నష్టం వాటిల్లినట్టు తెలిపారు.బాధిత రైతులను పరామర్శించి, ప్రభుత్వం ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన తూకం వేసి తరలించాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు రామోజు కృష్ణమాచారి, మాజీ సర్పంచులు జక్కుల రవీందర్, సన్నీల్ల వెంకటేష్, మాజీ ఉపసర్పంచులు అన్నాడి మల్లికార్జున్ రెడ్డి, అన్నాడి నరసింహారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు బోయిని రమేష్, కల్వాల సంపత్ రెడ్డి, చెప్యాల నారాయణరెడ్డి, బండి అంజిరెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## గన్నేరువరం లోనే పీహెచ్ సి నిర్మించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి



**శెనార్తి మీడియా, గన్నేరువరం**

మండల కేంద్రానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జనావాసాలు లేని ప్రాంతంలో నిర్మించకూడదని, గన్నేరువరంలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ వివేకానంద యూత్ అధ్యక్షుడు గూడూరు సురేష్ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారులకు ప్రజావాణి ద్వారా వినతిపత్రం అందజేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో గన్నేరువరం మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైంది. అయితే ఇటీవల దీనిని ఊరికి దూరంగా, జనావాసం లేని గుట్టల ప్రాంతంలోని క్రాసింగ్ వద్ద నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. ఇది ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతం కాదని, మండల కేంద్రంలో అన్ని గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే దృష్ట్యా, ఆరోగ్య కేంద్రాన్ని మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని గూడూరు సురేష్ కోరారు.స్థలం అందుబాటులో లేదని చెప్పడం సరికాదని, గ్రామసభ నిర్వహించి, తగిన స్థలాన్ని ఖరారు చేయాలని కోరారు. గన్నేరువరం మండల కేంద్రంలోనే చేపట్టాలని జిల్లా కలెక్టర్, వైద్యాధికారులను కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంశంపై పునర్విచారణ జరిపి, గన్నేరువరం ప్రజలకు సౌకర్యవంతమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని విన్నవించారు.

## సీఎస్ ను కలిసిన ఎమ్మెల్యే



**శెనార్తి మీడియా, మానకొండూర్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.రామకృష్ణారావును మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన రామకృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావు అందించిన సేవలు అమోఘమని, 14 పర్యాయాలు రాష్ట్ర బడ్జెట్ రూపొందించడంలో కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కొనియాడారు. అంతే కాకుండా అటు బీఆర్ఎస్ పాలనలోను, ఇటు కాంగ్రెస్ పాలనలోను బడ్జెట్ రూపొందించి అరుదైన ఘనత సాధించారని ఆయన కొత్త సీఎస్ రామకృష్ణారావును ప్రశంసలతో ముంచెత్తారు.

## రాజీవ్ రహదారిని 8 లైన్లుగా విస్తరించండి

- కేంద్రానికి మంత్రి పొన్నం విజ్ఞప్తి

**శెనార్తి మీడియా, కరీంనగర్**

హైదరాబాద్ నుండి కరీంనగర్ మీదుగా రామగుండం వరకు ఉన్న ప్రస్తుత రాజీవ్ రహదారిని 8 లైన్ల రహదారిగా విస్తరించాల్సిందిగా కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. ఈ విస్తరణ ప్రాజెక్టు వల్ల లక్షలాది మంది ప్రయాణికులకు సౌకర్యం కలుగుతుందని, ట్రాఫిక్ భారాన్ని తగ్గించడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న నాలుగు లైన్ల రహదారి రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రాకపోకలకు సరిపడడం లేదని, దీనివల్ల తరచూ రద్దీ, ఆలస్యం, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని మంత్రి తెలిపారు. రామగుండం పవర్ ప్లాంట్, ఫర్టిలైజర్స్ యూనిట్, కేసోరం సిమెంట్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలు విస్తరిస్తున్న తరుణంలో ట్రాఫిక్ భారాన్ని భరించలేకపోతున్నదన్నారు.రహదారి విస్తరణతో పారిశ్రామిక కేంద్రాలు, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మధ్య మెరుగైన కనెక్టివిటీ సాధ్యమవుతుందన్నారు. ఇది సరుకుల రవాణా వేగాన్ని పెంచుతుందనీ, ఆర్థిక కార్యకలాపాలకు బలాన్ని ఇస్తుందనీ చెప్పారు. భద్రతా ప్రమాణాలతో కూడిన విస్తృత రహదారి ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడగలదని వివరించారు. ఈ ప్రాజెక్టు అమలుతో ఆరోగ్య సేవలు, విద్య, పర్యాటక అభివృద్ధి వంటి రంగాల్లో కూడా ప్రయోజనాలు చేకూరతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో జనాభా పెరుగుదల, పారిశ్రామిక విస్తరణకు అనుగుణంగా దీర్ఘకాలికంగా ఉపయోగపడే రహదారి కావాలన్నారు. ఈ ప్రతిపాదిత 8-లైన్ హైవే నిర్మాణానికి తగిన పర్యావరణ మరియు భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రణాళిక రూపొందించాలని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తగిన సదుపాయాలు కల్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రం అభివృద్ధిలో కీలకమైన ఈ ప్రాజెక్టును త్వరితగతిన ఆమోదించాలని తన లేఖలో మంత్రి పేర్కొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆగ్రహం





**శెనార్తి మీడియా, కమలాపూర్:**

కమలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి లో జరిగిన వైద్యుల నిర్లక్ష్యంపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉప్పల్ గ్రామానికి చెందిన తిరుమల అనే మహిళ ప్రసూతికి ఆసుపత్రిలో చేరగా, శస్త్రచికిత్స సమయంలో కడుపులో కాటన్ ముక్క మర్చిపోవడం జరిగిందని పేర్కొన్నారు. ఇది పూర్తిగా వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన ఆయన, బీఆర్ఎస్ హయాంలో ఆసుపత్రుల అభివృద్ధికి విశేషంగా కృషి చేశామని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రుల స్థితి దయనీయంగా మారిందని విమర్శించారు. రోగులకు సకాలంలో వైద్యం అందకపోవడం బాధాకరమని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో "కేసీఆర్ కిట్"తో పాటు ఆడబిడ్డకు రూ.13,000, మగబిడ్డకు రూ.12,000 అందించేవారని, ప్రభుత్వ వాహనంలో మహిళలకు ఇంటి వరకు సురక్షిత రవాణా ఏర్పాటుండేదని గుర్తు చేశారు. బాధిత మహిళ తిరుమలకు అన్ని విధాలా సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ దుష్ప్రచారం

**శెనార్తి మీడియా, భూపాలపల్లి**

తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కుట్రలు – వాస్తవాలపై చర్చ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో మండలి బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూధనాచారి, మాజీ మంత్రి **కొప్పుల ఈశ్వర్, నీటి పారుదల నిపుణుడు వి. ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్ , కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, నడిపెల్లి దివాకర్ రావు, కోరుకంటి చందర్, దుర్గం చిన్నయ్య పాల్గొని మాట్లాడారు. 16 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమై అభివృద్ధిలో వెనుకపడిన నేపథ్యంలో ప్రజల దృష్టిని మరల్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టుపై అనవసర ఆరోపణలకు దిగింది అని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టు కాకతీయుల ఆలోచనలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న ప్రాజెక్టు. ఇది దేశంలోనే కాక, ప్రపంచంలోనూ అద్భుతంగా గుర్తింపు పొందినది అని పేర్కొన్నారు. కాళేశ్వరం అంటే కేసీఆర్‌నే గుర్తు చేసుకునే స్థితి ఉంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టుపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ ప్రజలను దారి తప్పిస్తోంది. ఎన్ డి ఎం ఏ నివేదిక ప్రకారం, ప్రాజెక్టులో చిన్నపాటి సాంకేతిక లోపాలున్నా అవి సులభంగా పరిష్కారమయ్యేలా ఉన్నాయన్నారు. మేడిగడ్డ బరాజ్ పిల్ర్ల సమస్యను రాజకీయంగా వాడుకుంటూ, ప్రజల్లో భయం కలిగించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత పాలనల్లో గోదావరిపై పెద్ద ప్రాజెక్టు లేకపోవడం కాంగ్రెస్ వైఫల్యాన్ని సూచిస్తుంది అన్నారు. మంథని నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచిన స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారానికి తెరలేపారు. భూసేకరణ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టడం బాధాకరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## భూభారతి పైలట్ ప్రాజెక్టు ప్రారంభం

- వి. సైదాపూర్ మండలంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభించిన కలెక్టర్ పమేలా సత్పతి

**శెనార్తి మీడియా, కరీంనగర్:** తెలంగాణ ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకొచ్చిన భూభారతి రెవెన్యూ చట్టాన్ని పరిశీలనాత్మకంగా అమలు చేయడం లక్ష్యంగా, కరీంనగర్ జిల్లాలోని వి. సైదాపూర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టు ప్రదేశంగా ఎంపిక చేసినట్టు జిల్లా కలెక్టర్ డా. పమేలా సత్పతి తెలిపారు. ఈ చట్ట అమలులో భాగంగా, మండలంలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నేటి నుండి ప్రారంభమయ్యాయని ఆమె పేర్కొన్నారు.

# మట్టితో మేలు – రహదారి నిర్మాణానికి రైతులకు లాభం..

- కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా అభివృద్ధికి జాతీయ రహదారుల విస్తరణ బాటలు వేసింది. జిల్లాలోని కాగజ్ నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద మంచిర్యాల నుండి వాంకిడి మండలం వరకు 94.6 కిలోమీటర్ల పొడవుతో రూ.3,900 కోట్ల వ్యయంతో నిర్మించిన 4 వరుసల జాతీయ రహదారిని సోమవారం కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీలు, ఎమ్మెల్సీలు, స్థానిక శాసన సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నితిన్ గడ్కరి మాట్లాడుతూ రహదారుల విస్తరణతో ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదం చేకూరుతుందని అన్నారు. జిల్లా వెనుకబడిన దశ నుండి ముందుకు సాగేందుకు ఇది దోహదం చేస్తుందని, రహదారుల అనుసంధానానికి మరిన్ని నిధులను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంటే గ్రామీణాభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు.మంచిర్యాల–తెలంగాణ/మహారాష్ట్ర సరిహద్దు మధ్య నిర్మించిన రహదారితో పాటు నిర్మల్–ఖానాపూర్ సెక్షన్‌లో రెండు వరుసల రహదారి, నాగపూర్–హైదరాబాద్ సెక్షన్‌లో అండర్ పాస్, సర్వీస్ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అవసరమైన మట్టిని చెరువులు, సాగునీటి ప్రాజెక్టుల నుండి ఉచితంగా తీసుకోవడంతో రైతులకు మేలు కలిగిందన్నారు. ఈ రహదారిని భవిష్యత్‌లో ఆరు వరుసలుగా విస్తరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలో తెలంగాణలో అనేక ప్రాజెక్టులు, రైల్వే, ఎరువుల కర్మాగారాలు, పసుపు బోర్డు వంటి పలు కీలక కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర మంత్రి



కోమటిరెడ్డి మాట్లాడుతూ.. అటవీ శాఖ అనుమతులు రావాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి కోసం కేంద్ర మంత్రి సహకరించాలని కోరారు.జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ... అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు రహదారి సదుపాయం అవసరమని, అనుమతుల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామాల అభివృద్ధికి దారి వేయనుందని అన్నారు. ఆదిలాబాద్ ఎంపీ, సిర్పూర్, ఆసిఫాబాద్ శాసన సభ్యులు కూడా ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు డిమాండ్లు, అభ్యర్థనలు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి హెలికాప్టర్ ద్వారా హాజరైన గడ్కరికి అధికారులూ, ప్రజాప్రతినిధులూ ఘన స్వాగతం పలికారు. రహదారుల విస్తరణతో ప్రాంత అభివృద్ధికి నాంది పలికిన ఈ కార్యక్రమం స్థానికంగా విశేష ఆసక్తికి కేంద్రబిందువైంది.

## నష్టపోయిన మామిడి తోటల్ని సందర్శించిన ఎమ్మెల్యే వినోద్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా నేన్నెల మండలంలో గాలివాన బీభత్సానికి నష్టపోయిన మామిడి తోటలు, రైతు కుటుంబాలను సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సందర్శించారు.నెన్నల మండలంలో ఇటీవల ఈదురుగాలుతో కురిసినకాల అకాల వర్షాలకు నేలమట్టమైన ఇండ్లను నష్టపోయిన మామిడి తోటలని చూశారు. ఈదురు గాలులు భారీ వర్షానికి నెన్నెల మండలం ఆవడం , గంగారం, చిత్తాపూర్,గ్రామాలలో మామిడి తోటలు గృహాలు నష్టపోయాయి.ముందుగా ఎమ్మెల్యే నెలమట్టమైన మామిడి తోటలను సందర్శించారు. నేలమట్టమైన గృహదారులు, రైతులను పరామర్శించారు. నష్టపోయిన ఇ ళ్లకు, రైతుల పంట నష్టానికి పరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అందుకోసం పూర్తి నివేదికను తయారు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.పంట నష్టపోయిన రైతులు గృహాలను కోల్పోయిన బాధితులను అన్ని విధాలు ఆదుకుంటామని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.నెన్నెల మాజీ ఉప సర్పంచ్ పుప్పాల అంజన్న తల్లి పుప్పాల తారక్క ఇంట్లో నిద్రిస్తుండగా ఇటీవలే కురిసిన వడగండ్లవాన వల్ల ఇంటి పైకప్పు కూలి గాయపడింది. ఆమె కూడా పరామర్శించారు. ఎమ్మెల్యే వెంటబెల్లంపల్లి ఆర్డిఓ హరికృష్ణ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## నేడు మెగా ప్లేస్‌మెంట్ మేళా

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఈనెల ఆరవ తేదీన మెగా ప్లేస్‌మెంట్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ పెట్టం మల్లేష్ సోమవారం తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 10 కంపెనీలకు పైగా ఈ మేలాలో పాల్గొంటాయన్నారు. 2018 - 2025 విద్యా సంవత్సరాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ మేళాకు అర్హులు అని అన్నారు. మేళాకు రెస్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో ఉదయం 9.30 నుంచి 4 గంటలలోపు హాజరుకావాలని కోరారు.

## గాలి బీభత్సానికి లేచిపోయిన ఇంటి పై కప్పు



**శెనార్తి మీడియా, శంకరపట్నం**

శంకరపట్నం మండల పరిధిలోని సోమవారం రాత్రి గాలి బీభత్సవంతో కురిసిన వర్షానికి రేకుల ఇంటి పైకప్పు లేచిపోయిన సంఘటన చోటు చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మొలంగూర్ గ్రామానికి చెందిన కాలేషి సంపత్ రేకుల ఇంటి పైకప్పు లేచిపోవడంతో త్రివ నష్టం వాటినట్లు బాధితుడు వాపోయాడు. ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# టాస్క్ ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డిపార్ట్మెంట్ (టాస్క్) ద్వారా ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ అందించడం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన టాస్క్ శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మాట్లాడుతూ 30 రోజుల పాటు అర్హత గల యువతకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించి వారి ఉపాధి అవకాశాలను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ మొదటి విడతలో ఎంపికైన 40 మంది నిరుద్యోగ యువతకు శిక్షణలో భాగంగా సి, సి++, జావా, పైథాన్, ఆప్టిట్యూడ్ రీజనింగ్ (ఎ&ఆర్), ఇంటర్వ్యూ నైపుణ్యాలలో శిక్షణ అందించడం జరుగుతుందని, అభ్యర్థుల వయస్సు 18-30 సంవత్స రాల మధ్య ఉండాలని, డిగ్రీ, డిప్లొ మా, బి.టెక్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమం అనంతరం నైపుణ్యత గల అభ్యర్థులకు ఉపాధి అవకాశానికి సహాయం అందించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, టాస్క్ ప్రతినిధి సాయికృష్ణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. భీమారం మండల కేంద్రానికి సందనవేని అజయ్ మండలంలోని ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమిస్తుందని, ఈ విషయమై తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన కునరపు చంద్రమొగిలి తనకు గ్రామ శివారులో ఉన్న భూమిని ఇతరులు అక్రమంగా ఆక్రమించారని, ఈ విషయమై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణంలోని సమీకృత కూరగాయల మార్కెట్లోని షట్టర్ల లబ్దిదారులు తాము వ్యాపారం చేసుకునే స్థలాన్ని అప్పగించినప్పుడు తమకు షట్టర్లు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు వ్యాపారము చేసుకునే వరుసలో రూములు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన ఎగ్గె ప్రవీణ్ గ్రామ శివారులో తమకు చెందిన భూమిని బంధువులు తమకు తెలియకుండా విక్రయించారని, ఈ లావాదేవీని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నస్పూర్ మండల కేంద్రానికి చెందిన చిందం లలిత తాను మీ-సేవ ఏర్పాటుకు అర్హత కలిగి ఉన్నానని, అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సి.పి.ఐ.(ఎం) న్యూడెమొక్రసీ ప్రతినిధులు తమ దరఖాస్తులో లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల చెరువుకు సంబంధించి ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్లను నిర్ణయించి చెరువు కబ్జా కాకుండా కాపాడాలని కోరారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన రామగిరి అరుణ తాను గత సంవత్సరాలుగా కిరాయి ఇంట్లో నివసిస్తున్నానని, తన భర్త మరణించారని, నిరుపేద అయిన తనకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లాలో కంపించిన భూమి

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

సోమవారం సాయంత్రం ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల భూమి కంపించింది. దాదాపు 3 నుంచి 10 సెకన్ల పాటు భూకంపం తీవ్రత స్థానికంగా కనిపించినట్లు తెలుస్తోంది. కరీంనగర్ లోని చైతన్యపురి, కిసాన్ నగర్, విద్యారణ్యపురి, కమాన్ ఏరియాలో, మంచిర్యాల జిల్లాలోని లక్సట్టిపేట్, జన్నారం లోని పలు చోట్ల , తదితర ప్రాంతాల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. ఇది ఇలా ఉంటె రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలలో కూడా స్వల్పంగా భూమి కంపించింది. భూకంపం సంభవించగా, ఇండ్లలో ఉన్న ఫర్నీచర్, వస్తువులు కదిలి, ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే, పరిస్థితి కాస్త శాంతించిన తరువాత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయినప్పటికీ, మళ్లీ భూకంపం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఎప్రిల్ 10న, భూకంపాలపై పరిశోధనలు చేసే నిపుణులు తెలంగాణాలో భూమి కంపించే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం, హైదరాబాద్, వరంగల్, అమరావతి, మహారాష్ట్రలో ప్రకంపనలు సంభవించవచ్చని వారు సూచించారు.

## విద్యా రంగ అభివృద్ధికి ప్రాధాన్యం

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఇటీవల విడుదలైన ఎస్.ఎస్.సి., ఇంటర్మీడియట్ ఫలితాలలో మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి లతో కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గ సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యా రంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ అన్ని రకాలుగా కృషి చేస్తుందని తెలిపారు. మంచిర్యాల బాలికల జూనియర్ కళాశాల నుండి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎ. లిఖిత, షేక్ సీద్రాకొహిన్, ద్వితీయ సంవత్సరంలో బి. సాత్విక, ఎండి. అజార్బీ, బెల్లంపల్లి బాలికల జూనియర్ కళాశాల నుండి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మహెక్ నజ్నీన్, ద్వితీయ సంవత్సరంలో జునైర సాబా, నిదాఫిర్దోస్, చెన్నూర్ బాలుర జూనియర్ కళాశాల నుండి ప్రథమ సంవత్సరంలో ఎన్. అభిరామ్, ఓ. సిద్దు, ద్వితీయ సంవత్సరంలో బి. వరుణ్ తేజ, ఎండి. అమన్ లు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. ఎస్.ఎస్.సి.లో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలోని బెల్లంపల్లి బాలికల పాఠశాల నుండి డి. అక్షయ, సుహైర్య, మంచిర్యాల బాలికల పాఠశాల నుండి ఆర్.వైష్ణవి, డి. రిషిత, ఎస్.వైశాలి, చెన్నూర్ బాలుర పాఠశాల నుండి ఎండి. సమీర్, ఎండి. ఫిరోజ్, ఎస్.రాంసూరి లు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. విద్యా రంగంలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతన్నల బాటలో శాస్త్ర విజ్ఞానం

- ఎమ్మెల్యే వినోద్




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు భూభారతి చట్టం, వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. శాస్త్రవేత్తలు తమ శాస్త్రీయ సలహాలు, సూచనలతో రైతుల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తల పాత్ర అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. కేవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ, రైతులకు సాగు విధానాలు, వాతావరణ పరిస్థితులపై నిరంతరంగా సమాచారం అందిస్తూ వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి కల్పన, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కారుకూరి రామచందర్, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## మూడు నెలలుగా వేతనాల్లేవు

- ఆసుపత్రి ఎదుట ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మూడు నెలలుగా వేతనాలు లేక అష్టకష్టాలు పడుతున్న బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళనకు దిగారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నామని పేర్కొన్నారు.తెలంగాణ మెడికల్ & హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఓం నారాయణ నేతృత్వంలో ఆసుపత్రి గేటు వద్ద ధర్నా నిర్వహించారు. వేతనాలు విడుదల చేయాలి, ఉద్యోగులకూ జీవించేందుకు హక్కుంది అంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు.వేతనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, మదింపు చూపించాలని, తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, దుర్గ ప్రసాద్, మహేష్ షహీన్, నీరజ్, రమేష్, అన్వార్, లక్ష్మణ్, సాయి కృష్ణ తదితర కార్మికులు పాల్గొన్నారు.

### ఐపీఎల్ 2025 ప్లే ఆఫ్స్ రేసు నుంచి

# సన్ రైజర్స్ ఔట్..

**ఢిల్లీ లక్కీ ఎస్కేప్..!**



ఐపీఎల్ 2024లో ఫైనల్‌లో ఓడి రన్నరప్‌గా నిలిచిన సన్ రైజర్స్ హైదరాబాద్.. ఐపీఎల్ 2025 సీజన్ నుంచి నిష్క్రమించింది. సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా ఫలితం తేలకుండానే ముగిసింది. దీంతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి ఎస్ఆర్‌హెచ్ తప్పుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు మాత్రం ఈ వర్షంతో కలిసొచ్చింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ప్లే ఆఫ్స్ రేసు నుంచి సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు నిష్క్రమించింది. సోమవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా ఫలితం తేలకుండానే రద్దు అయింది. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బ్యాటింగ్ చేశాక మొదలైన వాన ఎంతకూ తగ్గలేదు. దీంతో మ్యాచ్ రద్దు అయినట్లు అంపైర్లు ప్రకటించారు. ఇరు జట్లకూ చెరో పాయింట్ కేటాయించారు.

కాగా ఈ మ్యాచులో సన్ రైజర్స్ హైదరాబాద్ మెరుగైన ప్రదర్శన చేసింది. తొలుత ఢిల్లీ క్యాపిటల్స్‌కు బ్యాటింగ్ అప్పగించి కేవలం 133/7 పరుగులకే పరిమితం చేసింది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మూడు వికెట్లు తీసి.. ఢిల్లీ క్యాపిటల్స్ పతనాన్ని శాసించాడు. దీంతో సన్ రైజర్స్ హైదరాబాద్.. ఈ మ్యాచులో ఈజీగానే గెలిచేలా కనిపించింది. హిట్టర్లతో నిండిన హైదరాబాద్.. వీలైనంత త్వరగా మ్యాచును ముగించి.. కీలకమైన 2 పాయింట్లతో పాటు నెట్ రన్ రేట్‌ను భారీగా పెంచుకుంటుందని ఫ్యాన్స్ ఆశపడ్డారు.

కానీ సన్ రైజర్స్ హైదరాబాద్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్ ముగిశాక వర్షం మొదలైంది. ఆ తర్వాత ఎంతకూ వర్షం తగ్గలేదు. దీంతో మ్యాచును రద్దు చేసినట్లు అంపైర్లు ప్రకటించారు. కాగా ఐపీఎల్ 2025లో వర్షం కారణంగా మ్యాచ్ ఫలితం రాకపోవడం ఇది రెండోసారి. ఇదివరకే పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ కూడా రద్దు అయింది. దీంతో రెండు జట్లకూ చెరో పాయింట్ కేటాయించారు.

ఈ ఫలితంతో సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. 11మ్యాచులలో కేవలం మూడింట్లో మాత్రమే గెలిచిన ఆ జట్టు.. మిగతా మూడు మ్యాచులో గెలిచినా.. కేవలం 13 పాయింట్లు మాత్రమే అవుతాయి. ఇప్పటికే నాలుగు జట్లు 14 పాయింట్లు సాధించడంతో సన్ రైజర్స్ పోరాటం ముగిసినట్లయింది. ఈ ఫలితంతో ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానానికి చేరింది.





**వన్డేల్లో 124 రేటింగ్ పాయింట్లతో**

# భారత్ అగ్రస్థానం


**ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ జోరు**

**అటెస్టుల్లో ఆసీస్ దే పై చేయి!**

అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజా వార్షిక ర్యాంకింగ్స్ ప్రకారం భారతదేశం, ఆస్ట్రేలియా క్రికెట్ జట్లు అన్ని ఫార్మాట్లలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. మే 2024 నుండి ఇప్పటి వరకు జరిగిన అన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లను 100 శాతం బేస్‌గా తీసుకుని, గత రెండు సంవత్సరాల మ్యాచ్‌లను 50 శాతం విలువతో లెక్కించి విడుదల చేసిన ఈ ర్యాంకింగ్స్‌లో భారత్ టీ20, వన్డే ఫార్మాట్లలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, టెస్ట్ క్రికెట్‌లో మాత్రం ఆస్ట్రేలియా తన సింహాసనాన్ని మళ్లీ కైవసం చేసుకుంది. ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ విజేత అయిన ఆస్ట్రేలియా 126 రేటింగ్ పాయింట్లతో టెస్ట్ ఫార్మాట్‌లో నంబర్ వన్ జట్టుగా ఉంది. ఇది రెండవ స్థానంలో ఉన్న ఇంగ్లాండ్‌పై 13 పాయింట్ల ఆధిక్యం. ఇక ఈ ఏడాది ఆస్ట్రేలియాతో ఫైనల్‌లో తలపడనున్న దక్షిణాఫ్రికా 111 పాయింట్లతో మూడవ స్థానంలో ఉండగా, భారత్ నాల్గవ స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్తాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఐర్లాండ్ జట్లు వరుసగా టాప్ 10లో స్థానం పొందాయి. ఇక వన్డేల్లో భారత్ 124 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా (రెండు జట్లు 109 పాయింట్లు) భారత్‌కు వెనుకంజలో ఉన్నా, శ్రీలంక, పాకిస్తాన్ (104 పాయింట్లు) కూడా పోటీగా నిలుస్తున్నాయి. ఈ జాబితాలో దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి జట్లు దిగువ స్థానాల్లో ఉన్నాయి. అదే విధంగా టీ20 ఫార్మాట్‌లోనూ భారత్ తన ఆధిపత్యాన్ని మరింత బలంగా చూపించింది. ఇటీవలే టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు 271 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్ ఉన్నారు. దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ వరుసగా ఆరెవ నుండి పదవ స్థానాల్లో ఉన్నాయి. ఈ ర్యాంకింగ్స్ చూస్తే, భారత్ తన పరాక్రమాన్ని పరిపూర్ణంగా ప్రదర్శించడమే కాక, భవిష్యత్తులో కూడా అన్ని ఫార్మాట్లలో ప్రభావాన్ని కొనసాగించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టంగా తెలుస్తోంది. ఈ ర్యాంకింగ్స్ భారత్‌కు విశ్వాసాన్ని అందించడమే కాక, రాబోయే టోర్నమెంట్లకు సన్నద్ధమవ్వడానికి మోటివేషన్‌ను కూడా ఇస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలకు ముందు, భారత్ అన్ని ఫార్మాట్లలో టాప్ ర్యాంక్‌ను కొనసాగించడమే కాక, యువతరం ఆటగాళ్లను బలోపేతం చేయడంపై కూడా దృష్టి పెట్టనుంది. బీసీసీఐ వ్యూహాత్మకంగా స్క్వాడ్‌ను రొటేట్ చేస్తూ, అనుభవం, యువ శక్తికి సమతౌల్యాన్ని తీసుకువచ్చే దిశగా ముందుకు సాగుతోంది. ఇదే ధోరణిలో కొనసాగితే, భారత్ అంతర్జాతీయ క్రికెట్‌లో గల గ్లోబల్ డామినెన్స్‌ను మరింత పటిష్టం చేసే అవకాశముంది.

## ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించిన కమిన్స్

**తక్కువ స్కోరుకే పరిమితమైన ఢిల్లీ**



సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అదరగొట్టాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో అరుదైన రికార్డు నమోదు చేశాడు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్.. పవర్ ప్లేలో 3 వికెట్లు తీశాడు. ఢిల్లీ పతనాన్ని శాసించాడు. ఐపీఎల్ 2025 ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచులో సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లు రాణించారు. ఉప్పల్ వేదికగా జరిగిన ఈ మ్యాచులో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టును 7 వికెట్ల నష్టానికి 133 రన్స్‌కే పరిమితం చేశారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో కెప్టెన్‌గా, బౌలర్‌గా ఆశించిన మేర రాణించలేకపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్.. వర్చువల్ నాకౌట్ మ్యాచులో అదరగొట్టాడు. ప్లే ఆఫ్స్ అవకాశాలు నిలుపుకోవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచులో సత్తా చాటాడు. హైదరాబాద్‌లోని ఉప్పల్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచులో ఇన్నింగ్స్ ప్రారంభంలోనే మూడు వికెట్లు తీశాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. ఈ మ్యాచులో టాస్ గెలిచిన ప్యాట్ కమిన్స్ ఆతిథ్య ఢిల్లీ క్యాపిటల్స్‌కు బ్యాటింగ్ అప్పగించాడు. తాను సరైన నిర్ణయమే తీసుకున్నానని రుజువు చేసేలా పవర్‌ప్లే లోనే అదరగొట్టాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే కరుణ్ నాయర్‌ను గోల్డెన్ డక్ చేశాడు. ఆ తర్వాత వరుస ఓవర్లలో ఫాఫ్ డుప్లెసిస్ (3), అభిషేక్ పోరెల్ (8)లను పెవిలియన్ పంపించాడు. ప్యాట్ కమిన్స్ బౌలింగ్ వేయడం.. బ్యాట్‌ను ముద్దాడుతూ వెళ్లి బంతి వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ చేతిలో పడటం.. ఇదే తంతు. మూడు వికెట్లు ఇదే తరహాలో వచ్చాయి. ఆ తర్వాత కేఎల్ రాహుల్ (10), కెప్టెన్ అక్షర్ పటేల్ (6) కూడా త్వరగానే ఔట్ అయ్యారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 29 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. దీంతో ఆ జట్టు ఐపీఎల్‌లోనే అత్యల్ప స్కోరు (ఆర్సీబీ పేరిట ఉన్న 49 రన్స్) కంటే తక్కువకే ఆలౌట్ అయ్యేలా కనిపించింది. కానీ, ట్రిస్టన్ స్టబ్స్ (36 బంతుల్లో 41 రన్స్ నాటౌట్), విప్రాజ్ నిగమ్ (18), అశుతోష్ శర్మ (26 బంతుల్లో 41 రన్స్) పోరాడటంతో ఆ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 133 రన్స్ చేసింది . సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ప్యాట్ కమిన్స్ మూడు వికెట్లు తీశాడు. జయదేవ్ ఉనద్కత్, హర్షల్ పటేల్, ఇషాన్ మలింగ ఒక్కో వికెట్ తీశారు. ఉనద్కత్ 4 ఓవర్లు వేసి కేవలం 13 రన్స్ మాత్రమే ఇవ్వడం గమనార్హం.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ ముగిసిన వెంటనే ఉప్పల్ మైదానంలో భారీ వర్షం కురిసింది. దీంతో మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. మ్యాచ్ కనీసం 6 ఓవర్లు కూడా కొనసాగే పరిస్థితి లేకపోతే ఇరు జట్లకూ చెరొక పాయింట్ చొప్పున కేటాయిస్తారు.

# 'పెద్ది' షాట్ ఆడిన ఢిల్లీ ప్లేయర్..

ఢిల్లీ క్యాపిటల్స్ యువ ప్లేయర్ సమీర్ రిజ్వీ .. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' మూవీ గ్లింప్స్‌లోని క్రికెట్ షాట్‌ను రీక్రియేట్ చేశాడు. స్టెప్ ఔటై.. పిచ్‌ను బ్యాట్‌తో గుద్ది ఆడే ఈ షాట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఈ షాట్‌ను సమీర్ రిజ్వీ ఆడాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఢిల్లీ క్యాపిటల్స్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. పెద్ది సినిమా గ్లింప్స్‌లోని హిందీ డైలాగ్స్‌ను ఈ వీడియోకు ఉపయోగించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో కీలక పోరుకు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ ఈ షాట్‌ను రీక్రియేట్ చేసింది. ఉప్పల్ వేదికగా జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో ఈ వీడియోను షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ వీడియోకు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఫిదా అయ్యాడు. థ్యాంకూ అంటూ ట్వీట్ చేశాడు. సన్‌రైజర్స్‌తో మ్యాచ్ నేపథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆల్‌ది బెస్ట్ చెప్పాడు. అంతేకాకుండా ఆరెంజ్ ఆర్మీతో జాగ్రత్త అంటూ హెచ్చరించాడు. 'పెద్ది ఫస్ట్ షాట్‌ను రీక్రియేట్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ధన్యవాదాలు. నేటి మ్యాచ్‌కు ఆల్‌ది బెస్ట్. సన్‌రైజర్స్ బలంగా పుంజుకునే ప్రయత్నం చేస్తుంది. జాగ్రత్తగా ప్రిపేర్ అవ్వండి.'అని ఎక్స్‌వేదికగా రాసుకొచ్చాడు. ఈ పోస్ట్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ పెద్ది షాట్ రీక్రియేట్ వీడియోను కూడా జత చేశాడు. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు డైరెక్షన్‌లో చెర్రీ 16వ సినిమాగా 'పెద్ది' చిత్రం తెరకెక్కుతుంది. ఈ చిత్రాన్ని వ్రిద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమాను రిలీజ్ చేసే అవకాశం ఉంది. పెద్ది ఐకానిక్ క్రికెట్ షాట్‌ను మ్యాచ్‌లో ఆడొచ్చా? అనే సందేహం క్రికెట్ అభిమానులకు నెలకొంది. అయితే ఈ షాట్‌ను ఆడటం చాలా కష్టం. ఆడే ప్రయత్నం చేసినా బ్యాటర్లకు గాయమయ్యే అవకాశాలు ఉన్నాయి. బ్యాటర్‌కు అంత సమయం దొరకడం కష్టం. స్టెప్ ఔటై.. బ్యాట్‌ను క్రీజుతో గుద్దితే అంపైర్ ఊరుకోడు. రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటాడు. బ్యాట్‌తో బలంగా క్రీజును గుద్దితే .. పిచ్ డ్యామేజ్ అవుతుంది. ఈ సీజన్ ఆరంభంలో వరుస విజయాలతో టాప్ లేపిన ఢిల్లీ.. ఆ తర్వాత వరుస పరాజయాలతో చతికలపడింది. ప్రస్తుతం 10 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఢిల్లీ ప్లే ఆఫ్స్ చేరాలంటే తమ చివరి 4 మ్యాచ్‌ల్లో రెండు గెలవాలి. ప్లే ఆఫ్స్ చేరడానికి ప్రతీ జట్టు 16 పాయింట్స్ సాధించాల్సి ఉంటుంది. రన్‌రేట్ కూడా మెరుగ్గా ఉండాలి. టాప్-2లో నిలవాలంటే 18-20 పాయింట్స్ సొంతం చేసుకోవాలి. ఈ క్రమంలోనే సన్‌రైజర్స్‌తో జరిగే నేటి మ్యాచ్‌లో ఢిల్లీ గెలవడం అత్యంత కీలకం.



## బన్నీ-అట్లీ సినిమాపై పెరుగుతున్న అంచనాలు

పాన్ ఇండియా లెవెల్ లో తెలుగు హీరోలు తీస్తున్న సినిమాలు చిత్రసీమను షేక్ చేస్తున్నాయి. హాలీవుడ్ లెవెల్ యాక్షన్ హంగులు ఉన్న భారీ సెట్టింగ్స్, ఇలా ఎన్నెన్నో సినిమాలు ఇండియన్ సినిమా దగ్గర నుంచి వస్తున్నాయి. ఇక అలా ఇండియన్ సినిమా నుంచి రీసెంట్‌గా ఇంటర్నేషనల్ లెవెల్లో అనౌన్స్ అయిన సినిమా ఏదైనా ఉంది అంటే.. అది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ అని చెప్పవచ్చు. కాగా ఈ చిత్రం అనౌన్స్ చేసినపుడే అందులో విజువల్స్ చూసి హాలీవుడ్ లెవల్లో ప్లాన్ చేస్తున్నట్టు- అర్థం అవుతుంది. అయి-ంతే ఈ మూవీలో బన్ని మొత్తం మూడు పాత్రలు పోషించనున్నాని తెలుస్తోంది. ఇందుకోసం చాలా కసరత్తులు చేస్తున్నాడట. ఇక ఈ సినిమాతో విజువల్ ఎఫెక్ట్స్ పరంగా ఆడియెన్స్‌ని ఖచ్చితంగా మరో లోకం లోకి తీసుకెళ్ళడానికి బన్నీ ఇంకా అట్లీ- ఇద్దరు గట్టిగా ప్లాన్ చేస్తున్నారట. ఇదిలా ఉంటే ఈ రెంజ్ మూవీ కోసం యాక్టర్స్‌ని ఎంచుకోవడం ఒక్కింత కష్టం అనే చెప్పాలి. ఎందుకంటే ప్రతి ఒక్క పాత్ర చాలా ముఖ్యం. అందుకే ఇప్పటిక వరకు ఈ మూవీలో నటనటు-ల గురించి ఎలాంటి అప్ డేట్‌లు రావడంలేదు. కానీ తాజాగా ఈ సినిమాలో ఓ స్పెషల్ రోల్‌ను డిజైన్ చేస్తున్నట్లు- తెలుస్తోంది. ఈ పాత్రలో ఓ బాలీవుడ్ హీరోని తీసుకునే ఆలోచనలో మూవీ టీ-ం ఉన్నట్లు- సమాచారం. మరి ఆ హీరో ఎవరు అనేది చూడాలి. ప్రజంట్ టాలీవుడ్ బారీ చిత్రాల్లో ఒక్కరైనా బాలీవుడ్ యాక్టర్స్ కచ్చితంగా ఉంటున్నారు. మరి ఈ మూవీలో ఎవరు రాబోతున్నారు చూడాలి.



## నానితో నటించడానికి నో చెప్పిన రష్మిక

హీరోల కెరీర్ విషయంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. దానికి బిగ్ ఎగ్జాంపుల్ హీరో నాని.. ముందు అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేసి 'అష్టాచమ్మా' సినిమాతో తెలుగు ఇండస్ట్రీ లో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. కానీ నాని హీరోగా ట్రై చేస్తున్నా సమయంలో చాలా అవమానాలు ఎదుర్కొన్నారట . నువ్వు ఇండస్ట్రీలోకి సెట్ కావు.. నీ ఫేస్ కి అంత సీన్ లేదు ..ఇలా రకరకాలుగా మాట్లాడారట. అంతేకాదు నాని ఇండస్ట్రీలో హీరోగా సెటిల్ అయ్యి, హిట్స్ కొట్టిన తర్వాత కూడా చాలామంది హీరోయిన్లు ఆయన తో నటించాడిని నిరాకరించారట. ఇక ఓ హీరోయిన్ అయితే నానికి ఏకంగా మూడు సార్లు రిజెక్ట్ చేసిందట.




ఇంతకి ఆ హీరోయిన్ మరెవరో కాదు..రష్మిక మందన్నా. హా.. నేషనల్ క్రష్ గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రష్మిక నాని తో మూడుసార్లు సినిమా చేసే అవకాశం దక్కించుకుందట. కానీ మూడు సార్లు ఆమె ఆ సినిమా రిజెక్ట్ చేసిందట. ఇందులో ఎంత వరకు నిజం ఉందో తెలియదు కానీ, సోషల్ మీడియాలో ఈ న్యూస్ బాగా వైరల్ అవుతోంది. ఇప్పుడు కనుక చూసుకుంటే నాని రష్మికకు మించిన స్థాయిలోనే క్రేజీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. రీసెంట్‌గా 'హిట్ 3' మూవీతో నాని పేరు ఇండస్ట్రీలో మారుమ్రోగిపోతుంది. ఇది అందరికి సాధ్యం కాదు. కానీ నాని తన ట్యాలెంట్ తో సాదించుకున్నాడు. ఇప్పుడు నాని తో మూవీ అంటే ఏ హీరోయిన్ రిజక్ట్ చేసే ఛాన్స్ కూడా లేదు.






## హరిహర వీరమల్లు షూటింగ్ బిజీలో పవన్ కళ్యాణ్

హైదరాబాద్ కీర్తిలో మరో అద్భుతం చోటుచేసుకోబోతోంది. విజువల్ రంగంలో ఓ వండర్ ఆవిష్కృతం కాబోతున్నది. హైదరాబాద్‌లోని శ్రీ సారధి స్టూడియోలో సాంకేతికంగా సరికొత్త హంగులతో ఏర్పాటు చేసిన డాల్బీ మిక్సింగ్ స్టూడియో ఈ రోజు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైంది. ప్రస్తుతానికి ఈ స్టూడియోను ప్రభాస్ కల్కి సినిమా కోసం ఉపయోగించనున్నారు. ఈ కార్యక్రమానికి కీరవాణి, నిర్మాతలు కె.ఎల్ నారాయణ, దామోదర ప్రసాద్ , కె.ఎస్ రామారావు ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి స్టూడియోను ప్రారంభించారు.




## ఊరమాస్ లుక్‌లో సుహాస్

నటుడు సుహాస్ ఈ నడుమ మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఎంచుకుంటున్నాడు. తాజాగా ఆయన నటిస్తున్న మూవీ మండాడి. కోలీవుడ్ నటుడు సూరితో కలిసి ఈ సినిమా చేస్తున్నాడు. తమిళ డైరెక్టర్ మతిమారన్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నాడు. తాజాగా మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో సుహాస్ ఊరమాస్ లుక్ లో వైల్డ్ గా కనిపిస్తున్నాడు. గడ్డం, పొడ వాటి జుట్టు-తో రగ్డ్ లుక్ లో ఉన్నాడు. పైగా టీ- షర్టు, లుంగీలో కనిపిస్తున్నాడు. ఇది విలేజ్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తున్నట్టు- తెలుస్తోంది. టీ-షర్టు మీద టీ- సునామీ రైడర్స్ అని రాసి ఉం ది. ఇదేదో కబడ్డి ఆట నేపథ్యంలో సాగుతున్నట్టు ఉంది. ఇంకో పోస్టర్ లో సూరి, సుహాస్ సముద్రంపై పడవల్లో సీరియస్ లుక్ లో కనిపిస్తున్నారు. ఈ రెండు లుక్స్ ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నాయి. సుహాస్ ఇలాంటి సీరియస్ లుక్ లో ఇప్పటి వరకు కనిపించలేదు. ఇంత రగ్డ్ లుక్ తో కనిపిస్తుండటంతో ఈ మూవీపై ఒక్కసారిగా హైప్ పెరుగుతోంది. ఇప్పటి వరకు ఈ సినిమా గురించి టాలీవుడ్ లో పెద్దగా తెలియదు. కానీ ఈ ఒక్క పోస్టర్ తోనే టాలీవుడ్ అ-టె-న్షన్ మొత్తం తనవైపు మళ్లించుకు న్నాడు సుహాస్. మంచి కథలు ఎంచుకునే ఈ హీరో.. ఈ మండాడిలో ఇంకెలా ఉంటాడో అని అంతా వెయిట్ చేస్తున్నారు.



## శుభం ఓ మంచి మూవీ...ఆదరించండి

### నటి సమంత ప్రేక్షకులకు విజ్ఞప్తి

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి 'శుభం' చిత్రాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. ఇందులో సామ్ అతిథి పాత్ర కూడా పోషించారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించిన ఈ మూవీలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శ్రియ కొణతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపూడి, వంశీధర్ గౌడ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇక మే 9న విడుదల కానున్న ఈ మూవీ ప్రమోషన్స్ కూడా జోరుగా చేస్తున్నారు. తన హోమ్ బ్యానర్ నుంచి రాబోతున్న ఫస్ట్ మూవీ కావడంతో సమంత కూడా చాలా యాక్టివ్‌గా ప్రమోషనల్ కార్యక్రమాలలో పాల్గొంటు-న్నారు. ఇక రీసెంట్ గా ఈ మూవీకి సంబంధించి వైజాగ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. సమంతతో సహా సినిమాలో నటించిన నటీనటులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామ్ మాట్లాడుతూ.. వైజాగ్ లో ఈవెంట్స్ జరుపుకున్న తన సినిమాలు అన్నీ గుర్తు చేసుకుంది. ఇక్కడ ఈవెంట్ చేసిన ప్రతి సినిమా మంచి విజయం సాధించాయి, 'శుభం' చిత్రాన్ని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చింది. మూవీ చూశాక అందరు కూడా చిరు నవ్వుతోనే బయటకు వస్తారని పేర్కొన్నారు. అలాగే దాదాపు ఈ మూవీలో చాలా వరకు కొత్త వారినే తీసుకున్నారు. దీంతో ప్రతి ఒక్క ఈ మూవీ గురించి వారి అనుభూతిని పంచుకున్నారు. ఈ సందర్భంగా హీరో హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ.. ' రాజ్ అండ్ డీకే కారణంగానే ఈ సినిమాలో నటించే అవకాశం దక్కింది. స్టోరీ చెప్పినప్పుడే పడి పడి నవ్వుకున్నాను, హారర్ కామెడీని ఇలా కూడా తియ్యొచ్చా అనుకున్నాను. అండ్ సమంత మామ్ ఐ లవ్ యూ.. మీరు బాగా సపోర్ట్ చేశారు' అని చెప్పగా.. సామ్ నవ్వేసింది. ప్రజంట్ ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY V. SAMPATH PRINTED AT SHARADHA PRINTERS, SHASTRI ROAD, KARIMNAGAR- 505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,Cell: 9391343644
PUBLISHED AT H.NO.2-10-2126, MANKAMMATHOTA, BHAGYANANAR, KKARIMNAGAR, -505002, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE. EDITOR : V SAMPATH. TELTEL/2023/89146, EMAIL :shenarthimedia@gmail.com